www.epaper.asthram.com

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దినపత్రిక

గురువారం 20 నవంబర్ 2025

సంగారెడ్డి సంచిక : 83 సంపుటి : 1 పేజీలు : 8 వెల : రూ. 5/-

## మరింత ఆలస్యం కానున్న అన్ని బైకుల్లో ఏబీఎస్

అన్ని ద్విచక్ర వాహనాల్లో జనవరి 1 నుంచి యాంటీ-లాక్ బ్రేకింగ్ సిస్టమ్స్ (ఏబీఎస్) తప్పనిసరి చేయడానికి ఉద్దేశించిన గడువును కేంద్ర ప్రభుత్వం వాయిదా వేసే అవకాశం ఉంది. ప్రధాన ద్విచక్ర వాహన తయారీ కంపెనీలతో జరిగిన అనేక రౌండ్ల చర్చల తర్వాత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఏబీఎస్ అమలుకు మరింత సమయం కావాలని కంపెనీలు కోరాయి. ఈ ఏడాది జూన్‌లో ఏబీఎస్ తప్పనిసరి నిర్ణయాన్ని ప్రభుత్వం ప్రతిపాదించింది. కానీ, ఇంత తక్కువ సమయంలో అవసరమైన మార్పులు చేయడం, విడిభాగాల లభ్యత వంటి సమస్యల గురించి కంపెనీలు ప్రభుత్వానికి వివరించాయి. దీనికోసం కనీసం ఏడాది సమయం కావాలని అభ్యర్థించాయి.

### బీజేపీపై తప్పుడు పోస్టులు

# పెడితే కేసులు పెడతాం

- పార్టీ కార్యకర్తలకు బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు హెచ్చరిక
- ఇష్టారీతిన కామెంట్ చేస్తే సస్పెండ్ చేస్తామన్న రామచందర్ రావు
- బీజేపీపై ఎవరు పోస్టులు పెట్టినా కౌంటర్ ఇవ్వాలని సూచన
- బీజేపీపై తప్పుడు పోస్టులు పెడితే కేసులు పెడతామని హెచ్చరిక



హైదరాబాద్

పార్టీ కార్యకర్తలు ఇకపై ఇష్టారీతిన వ్యాఖ్యలు చేస్తే సస్పెండ్ చేస్తామని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు హెచ్చరించారు. హైదరాబాద్ నగరంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో లీగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో బీజేపీపై ఇతర పార్టీలు ఎవరు పోస్టులు పెట్టినా ప్రతి కార్యకర్త కౌంటర్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నకిలీ ఖాతాలతో బీజేపీ మీద పోస్టులు పెడుతున్నాయని ఆయన అన్నారు. తమపై తప్పుడు వార్త రాసిన పత్రికపై రూ. 5 కోట్ల పరువు నష్టం దావా - మిగతా 3లో




### నాకంటే ముందే బిహార్ గాలి తమిళనాడులో

- మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు
- రైతులు తమ చేతికందువాను గాల్లోకి ఊపారు
- నేను రావడానికి ముందే బిహార్ గాలి ఇక్కడకు వచ్చింది
- దేశ ఆర్థిక వ్యవస్థలో కోయంబత్తూరు జౌళిపరిశ్రమ కీలకంగా ఉంది
- ఈ ప్రాంతానికి చెందిన సీపీ రాధాకృష్ణన్ దేశ ఉపరాష్ట్రపతిగా ఉన్నారు.
- నేను చిన్నప్పుడే తమిళం నేర్చుకుని ఉండాల్సింది
- కోయంబత్తూరు సభలో ప్రధాని మోదీ భావోద్వేగం


# ఎన్నికలకు ముహూర్తం!

- తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు
- ఈనెల 23 వరకు గ్రామాల్లో ఓటర్ల జాబితాలను సవరించాలని నిర్ణయం
- 20న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణ, తప్పుల సవరణ
- 21న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం
- 23న తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ
- డిసెంబరు రెండో వారంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూలు వెలువడే అవకాశం
- పంచాయతీ ఎన్నికలకు.. నవంబర్ 25 కల్లా నోటిఫికేషన్!
- 2 రోజుల్లోగా డెడికేటెడ్-కమిషన్ నుంచి ప్రభుత్వానికి నివేదిక




హైదరాబాద్

తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా పంచాయతీల్లో ఓటరు జాబితా మరోసారి సవరణకు ఎస్ఈసీ షెడ్యూలు ప్రకటించింది. రేపటి నుంచి ఈనెల 23 వరకు గ్రామాల్లో ఓటర్ల జాబితాలను సవరించాలని నిర్ణయించింది. 20న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణ, తప్పుల సవరణ, 21న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం, 23న తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ ఉంటుందని ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈమేరకు జిల్లా పంచాయతీ అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో డిసెంబరు రెండో వారంలో పంచాయతీ ఎన్నికల - మిగతా 3లో



### షేక్ హసీనా అప్పగింతకు భారత్ విముఖత...

- బంగ్లాదేశ్ కీలక నిర్ణయం
- షేక్ హసీనాకు మరణశిక్ష విధించిన ట్రైబ్యునల్
- రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసేలా సన్నాహాలు చేపట్టిన బంగ్లాదేశ్
- బంగ్లాదేశ్ మీడియాలో వార్తలు

### ఇందిరమ్మే స్ఫూర్తి..

# కోటి మందికి చీరలు



- దేశానికి బలమైన నాయకత్వం అందించిన ఘనత ఇందిరాగాంధే
- దేశంలో రాజకీయ శూన్యత ఏర్పడిన సమయంలో ఇందిరా గాంధీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు
- అంబేద్కర్ ఆశయ సాధన కోసం ఎంతో కృషి చేశారు
- బ్యాంకుల జాతీయం, అగ్రికల్చర్ ల్యాండ్ సీలింగ్ యాక్ట్ తెచ్చి పేదలకు భూములు పంచినా, పేదలకు ఇండ్లు కట్టించినా అది ఇందిరమ్మకే సాధ్యమైంది
- పాకిస్తాన్‌తో యుద్ధం సమయంలో ధీటుగా నిలబడి ఎదుర్కొన్న ధీశాలి ఇందిరమ్మ

హైదరాబాద్

తెలంగాణలో ఇందిరమ్మ చీరల పంపిణీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. పలువురు లబ్ధిదారులకు సీఎం రేవంత్.. చీరలను అందించారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలకు కోటి చీరలను ప్రభుత్వం పంపిణీ చేయనుంది. అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలను ఇవ్వనున్నారు. తొలి దశలో నేటి నుంచి డిసెంబరు 9 తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం వరకు గ్రామీణ ప్రాంతాల్లో చీరలను పంపిణీ చేయనున్నారు. రెండో దశలో మార్చి 1 నుంచి మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు పట్టణ ప్రాంతాల్లో - మిగతా 3లో



### వీడిన ఉత్కంఠ..

- బీహార్ ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా నితీశ్ కుమార్ ఖరారు
- నితీశ్‌ను కూటమి నేతగా ఎన్నుకున్న ఎమ్మెల్యేలు
- పాట్నాలోని గాంధీ మైదానంలో ప్రమాణ స్వీకారం చేయనున్న నితీశ్
- బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 200కు పైగా స్థానాలు గెలిచిన ఎన్డీయే కూటమి

# బీ కేర్‌ఫుల్!

- వచ్చే రెండ్రోజులు మరింత చలిగాలులు..
- మరో ఐదు జిల్లాలలో తీవ్రమైన చలిగాలులు వీచే అవకాశం
- కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం
- రాష్ట్రవ్యాప్తంగా 14 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి
- బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయి

హైదరాబాద్

రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో వచ్చే రెండు రోజులు తీవ్రమైన చలి గాలులు వీస్తాయని వాతావరణశాఖ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్‌లో ఎల్లో అలర్ట్ జారీ చేసినట్టు పేర్కొన్నది. ఆదిలాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, ఆసిఫాబాద్, కుమ్రంభీం, నిర్మల్ జిల్లాలతోపాటు మరో ఐదు జిల్లాలలో - మిగతా 3లో




- మృతుల్లో అగ్రనేత దేవ్‌జీ!
- నిన్నటి ఎన్‌కౌంటర్‌లో కీలక నేత హిడ్మా మృతి చెందినట్లు డీజీ వెల్లడి
- వివిధ జిల్లాల్లో 50 మంది మావోయిస్టు సానుభూతిపరుల అరెస్ట్
- ఛత్తీస్‌గఢ్ నుంచి ఏపీలోకి మావోయిస్టుల చొరబాట్లు పెరిగాయన్న పోలీసులు

# ఏవోబీలో తుపాకుల మోత

### మారేడుమిల్లి అడవుల్లో మరో భారీ ఎన్‌కౌంటర్.. ఏడుగురు మావోయిస్టుల మృతి.. నిన్న హిడ్మా.. నేడు దేవ్‌జీ





ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీలోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య భీకరమైన ఎదురుకాల్పులు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు ఏపీ ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేశ్ చంద్ర లడ్డా ధృవీకరించారు. ఈ ఏడుగురిలో ముగ్గురు మహిళా మావోయిస్టులు ఉన్నట్లు పేర్కొన్నారు. బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో చనిపోయిన వారంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని సమాచారం. మృతులను మావోయిస్టులు జోగారావు అలియాస్ టెక్ శంకర్, సీత అలియాస్ జ్యోతి, సురేశ్, గణేశ్, వాసు, అనిత, షమ్మిగా పోలీసులు గుర్తించారు.

# ఏవోబీలో తుపాకుల మోత

అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో మరోసారి తుపాకుల మోత మోగింది. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఈ తెల్లవారుజామున భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య భీకరమైన ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారిగా గుర్తించారు. వీరిలో మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ కూడా ఉన్నట్లు సమాచారం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో కూంబింగ్ కొనసాగుతోంది. ఈ ఎన్‌కౌంటర్‌ను ఏపీ ఇంటెలిజెన్స్ డీజీ మహేశ్‌చంద్ర లడ్డా విజయవాడలో ధ్రువీకరించారు. రాష్ట్రంలో మావోయిస్టుల కదలికలపై పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశామని, వారిని ఏరివేసేందుకు ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. మిగిలిన మావోయిస్టులు లొంగిపోవాలని ఆయన సూచించారు. నిన్న అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో సెంట్రల్ కమిటీ సభ్యుడు హిడ్మా మధ్వితో పాటు మరో ఐదుగురిని మట్టుబెట్టినట్లు డీజీ వివరించారు. హిడ్మా ఎదురుకాల్పుల్లోనే మరణించారని, ఆయన్ను పట్టుకుని చంపారనే ఆరోపణల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు.

మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా మావోయిస్టులపై ఉక్కుపాదం మోపుతున్నట్లు డీజీ తెలిపారు. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో మొత్తం 50 మందిని అరెస్టు చేశామని వెల్లడించారు. వీరిలో ముగ్గురు స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, 23 మంది ప్లాటూన్ సభ్యులు ఉన్నారు. అరెస్టయిన వారి నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో దాడులు పెరగడంతో మావోయిస్టులు ఏపీలోకి ప్రవేశిస్తున్నారని, ఈ క్రమంలోనే పట్టుబడుతున్నారని ఆయన తెలిపారు. నిన్న పట్టుబడ్డ 50 మంది మావోయిస్టులను ఇవాళ విజయవాడలో మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మహేశ్ చంద్ర లడ్డా మీడియాతో మాట్లాడారు. మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ నుంచి ఏపీకి రావడానికి మావోయిస్టులు ప్రయత్నిస్తున్నారు. నిఘా వర్గాల సమాచారం మేరకు పోలీసులు కూంబింగ్ చేపట్టి.. మావోయిస్టుల కదలికలను గమనించారు. నవంబర్ 17న ఒక ఆపరేషన్ ప్రారంభించాం. 18న ఉదయం అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో సెంట్రల్ కమిటీ మెంబర్ హిడ్మాతో పాటు మరో ఐదుగురు మావోయిస్టులు హతమయ్యారు.

ఇక ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో 50 మంది మావోయిస్టులను అరెస్టు చేశామన్నారు. వీరిలో స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్లు ముగ్గురు, ప్లాటూన్ మెంబర్లు 23 మంది, డివిజినల్ కమిటీ మెంబర్లు ఐదుగురు, ఏరియా కమిటీ మెంబర్స్ 19 మంది ఉన్నట్లు తెలిపారు. పట్టుబడ్డ మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

# నాకంటే ముందే బిహార్ గాలి తమిళనాడులో



తనకంటే ముందే బిహార్ గాలి తమిళనాడుకు వచ్చిందని ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. తనను పలకరించేందుకు రైతులు తమ చేతి కండువాను ఊపడంతో ఆ భావన కలిగిందని పేర్కొన్నారు. బుధవారం తమిళనాడుకు వెళ్లిన ఆయన కోయంబత్తూరులో నిర్వహించిన సభలో మాట్లాడారు. "నేను వేదికపైకి రాగానే.. రైతులు తమ చేతికండువాను గాల్లోకి ఊపారు. నేను రావడానికి ముందే బిహార్ గాలి ఇక్కడకు వచ్చిందని ఆ దృశ్యం చూడగానే అనిపించింది" అని రైతులు, జౌళిరంగ కార్మికులను ఉద్దేశించి మోదీ అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో కోయంబత్తూరు జౌళిపరిశ్రమ కీలకంగా ఉందని వెల్లడించారు. ఈ ప్రాంతానికి చెందిన సీపీ రాధాకృష్ణన్ దేశ ఉపరాష్ట్రపతిగా ఉన్నారని గుర్తుచేశారు. వ్యవసాయం తన మనసుకు ఎంతో దగ్గరగా ఉంటుందన్నారు. సేంద్రీయ వ్యవసాయంలో భారత్ ఒక గ్లోబల్ హబ్‌గా మారే దిశగా పయనిస్తోందని వెల్లడించారు. "ఇక్కడ నేను ఒక ఎగ్జిబిషన్ చూశాను. అందులో చాలామంది రైతులతో మాట్లాడే అవకాశం లభించింది. మెకానికల్ ఇంజినీరింగ్, పీహెచ్‌డీ చదువుకొన్న వారు కూడా వ్యవసాయం చేస్తున్నారు. నాసాలో ఉద్యోగం వీడి వ్యవసాయాన్ని వృత్తిగా ఎంచుకున్నవారిని చూశాను. అలాగే వారు యువతకు నైపుణ్యాలు నేర్పుతున్నారు. నేను ఇక్కడకు రాకపోయి ఉంటే.. ఇవన్నీ మిస్‌అయ్యే వాడిని. ఈ విషయాన్ని నేను బహిరంగంగా అంగీకరిస్తున్నాను. ఈ సందర్భంగా వారి ధైర్యానికి సెల్యూట్ చేస్తున్నాను. రానున్న రోజుల్లో దేశ వ్యవసాయరంగంలో అనేక మార్పులు రానున్నాయి. అవి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయనున్నాయి" అని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే.. ఈ నెల జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే 243 అసెంబ్లీ స్థానాలకుగానూ.. 202 సీట్లతో కూటమి ప్రభంజనం సృష్టించింది. ఇక తమిళనాడులో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీనిని ఉద్దేశించే ప్రధాని మోదీ ఆ వ్యాఖ్యలు చేశారు.

**పీఎం కిసాన్ నిధులు విడుదల**

తాను చిన్నతనంలోనే తమిళ భాష నేర్చుకుని ఉండాల్సింది అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. తమిళనాడులోని కోయంబత్తూరులో బుధవారం జరిగిన దక్షిణ భారత సేంద్రియ రైతుల సదస్సులో ఆయన ఈ వ్యాఖ్య చేశారు. ఓ రైతు నాయకుడి తమిళ ప్రసంగం తనను ఎంతగానో ఆకట్టుకుందని, కానీ అది పూర్తిగా అర్థం కాకపోవడంపై కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు.

సదస్సులో రైతు నాయకుడు పీఆర్ పాండియన్ తమిళంలో ప్రసంగించారు. అనంతరం మాట్లాడిన ప్రధాని మోదీ, "పాండియన్ ప్రసంగం తమిళంలో ఉండటం వల్ల అద్భుతంగా ఉంది. కానీ, అది నాకు పూర్తిగా అర్థం కాలేదు. ఇది చూశాక, చిన్నప్పుడే నేను తమిళం నేర్చుకుని ఉంటే బాగుండేదనిపించింది" అని పేర్కొన్నారు. ప్రధాని వ్యాఖ్యలకు సభకు హాజరైన రైతుల నుంచి పెద్దయెత్తున చప్పట్లు లభించాయి. పాండియన్ ప్రసంగాన్ని తనకు హిందీ లేదా ఇంగ్లీషులోకి అనువదించి ఇవ్వాలని గవర్నర్ ఆర్.ఎన్. రవిని కోరినట్లు తెలిపారు. ఇదే వేదికపై నుంచి ప్రధాని మోదీ 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' తాజా విడత నిధులను విడుదల చేశారు. "ఈ రోజు, దేశవ్యాప్తంగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ.18,000 కోట్లు జమ చేశాం. ఈ పథకం కింద ఇప్పటివరకు రూ.4 లక్షల కోట్లకు పైగా నేరుగా రైతులకు అందించాం" అని వెల్లడించారు. వస్త్ర పరిశ్రమకు పేరుగాంచిన కోయంబత్తూరు, ఇప్పుడు ప్రకృతి వ్యవసాయంలో నాయకత్వ స్థానంలో నిలవడం గర్వకారణమని ప్రధాని ప్రశంసించారు. అనంతరం, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను సందర్శించి, రైతులతో ముచ్చటించారు. కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకం ద్వారా ఈ ఏడాది రైతులకు రూ.10,000 కోట్ల ప్రయోజనం చేకూరిందని, పశుపోషకులు, మత్స్యకారులు కూడా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో సాంకేతిక సమావేశాలు, ప్రదర్శనలు ఉంటాయి.

# వీడిన ఉత్కంఠ..



**పాట్నా:** ఇటీవల బిహార్ ఎన్నికల్లో ఎన్‌డీయే కూటమి ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే ఈ క్రమంలో నూతన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి ఎవరు? అనే అంశంపై ఉత్కంఠ కొనసాగుతూ వస్తోంది. ఈ క్రమంలో బిహార్ సీఎం అభ్యర్థి ఉత్కంఠ వీడింది. రేపు బిహార్ ముఖ్యమంత్రిగా జేడీయూ అధిపతి నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలుస్తోంది. ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రులుగా బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హా ప్రమాణ స్వీకారం చేయనున్నారంటూ జాతీయ మీడియా కథనాలు వెలుగులోకి వచ్చాయి. ఎన్డీయే శాసనసభా పక్ష నేతగా నితీశ్ కుమార్ ఎన్నికయ్యారు. ఎన్డీయే శాసనసభా పక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు నితీశ్‌ను కూటమి నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరికాసేపట్లో గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన లేఖ సమర్పించనున్నారు. నితీశ్ కుమార్ రేపు పదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. పాట్నాలోని గాంధీ మైదానంలో ఆయన ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరగనుంది.

అయితే, బిహార్ ఎన్నికల కౌంటింగ్ ప్రారంభమై.. ఎన్‌డీఏ కూటమి నేతలు ఆధిక్యంలో ఉండగా రాష్ట్రానికి తదుపరి సీఎం ఎవరు? అనే ప్రశ్న తలెత్తింది ఆ సమయంలో రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి నితీష్ కుమారేనంటూ జేడీయూ ట్వీట్ చేసింది. కొద్ది సేపటికి ఆ ట్వీట్‌ను డిలీట్ చేసింది. దీంతో మహారాష్ట్ర తరహా పాలిటిక్స్‌ను కమలం పెద్దలు బిహార్‌లో అప్లయి చేస్తున్నారనే ఊహాగానాలు కొనసాగుతూ వచ్చాయి. ఈ క్రమంలో బుధవారం ఎన్డీఏ కూటమి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కూటమి నేతలు బిహార్ సీఎంగా నితీష్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. నితీష్ కుమార్ తదపరి సీఎంగా నితీష్ కుమార్ ప్రమాణ స్వీకారం చేయడం లాంఛనమైంది. రేపే నితీష్ ప్రమాణ స్వీకారమహోత్సవానికి ప్రభుత్వం అంగరంగవైభవం ఏర్పాట్లు ముమ్మరం చేసినట్లు వెలుగులోకి వచ్చిన జాతీయ మీడియా కథనాలు హైలెట్ చేశాయి. ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 200కు పైగా స్థానాల్లో విజయం సాధించింది. ఎన్డీయే కూటమిలో భాగమైన బీజేపీ 89 స్థానాల్లో, జేడీయూ 85 స్థానాల్లో, ఎల్జేపీ (పాశ్వాన్) 19 స్థానాల్లో గెలుపొందాయి. ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ ఈ ఎన్నికల్లో పరాజయం పాలైంది. జేడీయూ 25 స్థానాల్లో గెలుపొంది ప్రతిపక్ష హోదాను నిలబెట్టుకుంది.

# శబరిమల బస్సులు: కేరళ వర్సెస్ తమిళనాడు



**చెన్నై:** శబరిమలకు నడిచే ప్రైవేటు బస్సుల విషయంలో తమిళనాడు వర్సెస్ కేరళ అన్నట్లుగా పరిస్థితులు మొదలయ్యాయి. దీంతో 10 రోజుల పాటు కేరళకు బస్సులను నడిపేది లేదంటూ తమిళనాడు ప్రైవేటు బస్ ఆపరేటర్లు భీష్మించుకున్నారు. ఈ నిర్ణయం తీసుకోవడం వల్ల ఇప్పటికే తమకు రూ.22 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ప్రైవేట్ బస్ ఆపరేటర్లు చెబుతున్నారు.

**వివాదమేంటి??**

శబరిమల సీజన్ ప్రారంభం కావడంతో.. ఎప్పటిలాగే తమిళనాడు ప్రైవేటు బస్ ఆపరేటర్లు కేరళకు సర్వీసులను ప్రారంభించారు. నిజానికి ప్రభుత్వ రవాణా సంస్థలు నడిపే బస్సుల సంఖ్య డిమాండ్‌కు అనుగుణంగా లేకపోవడంతో.. ఆ భర్తీని ప్రైవేటు బస్ ఆపరేటర్లు తీరుస్తున్నారు. 150 వరకు బస్సులు తమిళనాడులోని వేర్వేరు ప్రాంతాల నుంచి అయ్యప్ప భక్తులను శబరిమలకు తీసుకువస్తుంటాయి. అయితే.. ఈసారి సీజన్ ప్రారంభమైనా.. తమిళనాడు బస్ ఆపరేటర్లకు కేరళ రాష్ట్ర రవాణా శాఖ పర్మిట్లు ఇవ్వలేదు. పర్మిట్లు లేకుండా.. ఆల్-ఇండియా టూరిస్టు అనుమతి పత్రాలతో తమ రాష్ట్రంలోకి వచ్చే బస్సులకు భారీ జరిమానాలు విధించింది. దీంతో.. బస్ ఆపరేటర్లు కేరళకు బస్సులు నడిపేది లేదని తేల్చిచెప్పారు. 10 రోజుల క్రితమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తమిళనాడు ప్రైవేటు బస్సుల యజమానుల సంఘం అధ్యక్షుడు ఎన్.అంబలగన్ మీడియాకు తెలిపారు.

**కేరళీయులకూ ఇబ్బందులే..**

అయ్యప్ప భక్తులను శబరిమలకు తీసుకువచ్చే ప్రైవేటు బస్సులు.. తిరుగు ప్రయాణంలో తమిళనాడుకు వచ్చే కేరళీయులకు సేవలు అందిస్తున్నాయి. తమిళనాడులోని వేర్వేరు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఈ బస్సులు సౌకర్యవంతంగా ఉంటాయి. ఈ విషయంలో భక్తులు, ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని, కేరళ సర్కారు ప్రైవేటు బస్సులకు పర్మిట్లు ఇవ్వాలని, ప్రైవేటు బస్ ఆపరేటర్లపై వేధింపులను ఆపాలని అంబలగన్ డిమాండ్ చేశారు. భక్తుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని, మినీ బస్సులకు కూడా అనుమతినివ్వాలని కోరారు. ఇందుకోసం కేరళ సర్కారుతో చర్చలకు సిద్ధమని పేర్కొన్నారు.

## రాహుల్ కు ప్రముఖుల లేఖ

## అనవసర ఆరోపణలు వద్దని సూచన

**న్యూఢిల్లీ :** భారత ప్రజాస్వామ్యం, దాని మూల స్తంభాలపై దాడి జరుగుతోందంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి 272 మంది ప్రముఖులు లేఖ రాశారు. ఓట్ల చోరీ జరుగుతోందని కేంద్ర ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో ఆయన విధానాలను విమర్శిస్తూ ఈ లేఖ వెలువడింది. ఈ లేఖపై 16 మంది రిటైర్డ్ న్యాయమూర్తులు, 123 మంది మాజీ అధికారులు, 133 మంది మాజీ సైనికాధికారులు, 14 మంది మాజీ రాయబారులు సంతకాలు చేశారు.ప్రజాస్వామ్యం, దాని పునాదులపై దాడి జరుగుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సొంత రాజకీయ ప్రయోజనాల కోసం నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని రాహుల్ గాంధీ ఆరోపించారని గుర్తు చేశారు. ఆధారాలు లేని ఆరోపణలు చేయడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులను బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు. అయితే, ఈ విషయంపై రాహుల్ గాంధీపై ఎలాంటి అధికారిక ఫిర్యాదు నమోదు కాలేదని తెలిపారు.ప్రతిపక్ష నాయకుడు ఎన్నికల కమిషన్‌పై పదేపదే దాడి చేస్తూ, ఓట్ల చోరీకి సంబంధించి తన వద్ద అణుబాంబు లాంటి ఆధారాలు ఉన్నాయని చెబుతూ నమ్మశక్యం కాని, అభ్యంతరకర భాషను ఉపయోగిస్తున్నారని వారు విమర్శించారు. ఈసీలో కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ఎవరినీ వదిలిపెట్టబోమని బెదిరింపులకు పాల్పడటం సరికాదని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను విమర్శించడాన్ని వారు ఖండించారు.ఎస్ఐఆర్‌పై ఈసీ ఇప్పటికే వివరణ ఇచ్చిందని, సుప్రీంకోర్టు కూడా దీనిపై మార్గదర్శకాలు జారీ చేసిందని వారు గుర్తు చేశారు. ఈ ప్రక్రియలో అనర్హులను తొలగించి, కొత్తగా అర్హత కలిగిన ఓటర్లను చేర్చడం మాత్రమే జరుగుతుందని వారు స్పష్టం చేశారు.ఎన్నికల ఫలితాలు అనుకూలంగా వస్తే రాహుల్ గాంధీ ఈసీపై ఆరోపణలు చేయడం లేదని, వ్యతిరేకంగా వస్తే మాత్రం ఈసీని విలన్‌గా చిత్రీకరిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు రాజ్యాంగ ప్రక్రియను గౌరవించాలని, నిరాధారమైన ఆరోపణలు చేయడం మానుకుని, విధానపరమైన ప్రకటనలతో పోటీ పడాలని వారు ఆ లేఖలో సూచించారు.

## షేక్ హసీనా అప్పగింతకు భారత్ విముఖత



లబంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించాలని భావిస్తోంది. మానవత్వం మరిచి తీవ్ర నేరాలకు పాల్పడ్డారన్న కేసులో షేక్ హసీనాకు బంగ్లాదేశ్ అంతర్జాతీయ క్రైమ్ ట్రైబ్యునల్ మరణశిక్ష విధించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆమెను తమకు అప్పగించాలని యూనస్ ప్రభుత్వం కోరుతున్నప్పటికీ భారత్ విముఖత చూపిస్తోంది. ఈ మేరకు బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ చర్యలు తీసుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. గత సంవత్సరం దేశం విడిచిన షేక్ హసీనా, మాజీ హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్‌లపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాల్సిందిగా ఇంటర్‌పోల్‌ను అభ్యర్థించడానికి బంగ్లాదేశ్ ప్రాసిక్యూటర్ గాజీ తమీమ్ సన్నాహాలు చేస్తున్నారని బంగ్లాదేశ్ దినపత్రిక 'ది ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్' నివేదించింది.

పరారీలో ఉన్న ఇద్దరు నిందితులపై రెడ్ నోటీసులు జారీ చేయాలని కోరుతూ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఇదివరకే ఇంటర్‌పోల్‌కు అరెస్టు వారెంటుతో పాటు దరఖాస్తు సమర్పించినట్లు బంగ్లాదేశ్ మీడియాలో వార్తలు వచ్చాయి. గత సంవత్సరం జరిగిన రిజర్వేషన్ల ఆందోళనలు హింసాత్మకంగా మారిన నేపథ్యంలో షేక్ హసీనా బంగ్లాదేశ్ నుంచి వచ్చి ఢిల్లీలో గుర్తు తెలియని ప్రాంతంలో ఉంటున్నట్లు తెలుస్తోంది.

## హిందూ మహిళలు విల్లు రాయాలి..

## ఆస్తి వివాదాలపై సుప్రీంకోర్టు



దేశంలో హిందూ మహిళల ఆస్తులపై గత కొన్నేళ్లుగా వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. హిందూ మహిళ ఆస్తి కోసం పుట్టింటివారు, అత్తింటి వారు కోర్టు మెట్లు ఎక్కుతున్న ఘటనలు అనేకం జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళలు తమ మరణానంతరం ఆస్తిపై వివాదం లేకుండా ఉండాలంటే.. వారు బతికి ఉండగానే ఆస్తి ఎవరికి చెందాలనే విషయంలో స్పష్టంగా వీలునామా రాయాలని సూచించింది. మహిళకు పిల్లలు లేకపోతే ప్రస్తుత హిందూ వారసత్వ చట్టం ప్రకారం ఆమె ఆస్తి మొదటగా భర్త కుటుంబానికి వెళ్లే అవకాశం ఉంటుందని కోర్టు గుర్తుచేసింది. కానీ చాలా సందర్భాల్లో ఆస్తి విషయమై మహిళ పుట్టింటి వాళ్లకు, అత్తింటి వారికి మధ్య వివాదాలు చెలరేగుతున్నాయని పేర్కొంది. వివాహానంతరం మహిళ గోత్రం మారుతుందన్న సంప్రదాయ అంశాన్ని కూడా కోర్టు ప్రస్తావిస్తూ.. వివాహం తర్వాత మహిళపై ప్రధాన బాధ్యత భర్త కుటుంబానిదే అవుతుందని పేర్కొంది. కానీ పిల్లలు లేని మహిళల ఆస్తుల విషయంలో, విడాకులు తీసుకోకుండా భర్తకు దూరంగా ఉంటున్న మహిళల ఆస్తుల విషయంలో వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ కారణంగా వారసత్వ హక్కుల్లో తలెత్తే సమస్యలు పరిష్కరించేందుకు ప్రీ%-%లిటిగేషన్ మిడియేషన్ (మధ్యవర్తిత్వం) తప్పనిసరి చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మధ్యవర్తిత్వంలో వచ్చే ఒప్పందాలను కోర్టు తీర్పు (డిక్రీ) గా పరిగణించాలని తెలిపింది. కొంతమంది న్యాయవాదులు ప్రస్తుత వారసత్వ చట్టంలోని సెక్షన్ 15(1)(బి) వివక్షాత్మకమని అభిప్రాయపడుతున్నారని, దాన్ని మార్చాలంటే చట్టసవరణ చేయాలని, అది పార్లమెంట్ చేయాల్సిన పని మాత్రమేనని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది.

## ఆత్మహత్య చేసుకుంటానని జీవిత భాగస్వామి

## బెదిరించడం క్రూరత్వమే: బాంబే హైకోర్టు

**ముంబై:** ఆత్మహత్య చేసుకుంటానని జీవిత భాగస్వామి పదే పదే బెదిరించడం క్రూరత్వమేనని హైకోర్టు తెలిపింది. అలాంటి పరిస్థితుల్లో వైవాహిక సంబంధాన్ని కొనసాగించడం అసాధ్యమని పేర్కొంది. ఒక వ్యక్తికి విడాకులు మంజూరు చేసింది. మహారాష్ట్రకు చెందిన దంపతులకు 2006లో వివాహమైంది. అయితే వైవాహిక గొడవల వల్ల 2012 నుంచి వారిద్దరూ విడిగా నివసిస్తున్నారు. భార్య తనను అనుమానించడంతోపాటు ఆత్మహత్యకు పాల్పడతానని పదే పదే బెదిరిస్తున్నదని భర్త ఆరోపించాడు. భార్య నుంచి విడాకులు కోరుతూ కుటుంబ కోర్టును ఆశ్రయించాడు. కాగా, 2019లో విడాకుల పిటిషన్‌ను కుటుంబ కోర్టు తిరస్కరించడాన్ని ఆ వ్యక్తి బాంబే హైకోర్టులో సవాల్ చేశాడు. ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర్, జస్టిస్ గౌతమ్ అంఖద్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. జీవిత భాగస్వామి ఆత్మహత్య చేసుకుంటానని పదేపదే బెదిరించడం క్రూరత్వానికి సమానమని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బెంచ్ ప్రస్తావించింది. మరోవైపు అలాంటి పరిస్థితుల్లో శాంతియుత వాతావరణంలో వైవాహిక సంబంధంలో జీవిత భాగస్వాములు కొనసాగడం అసాధ్యమని బాంబే హైకోర్టు తెలిపింది. ఆ దంపతులు దశాబ్ద కాలంగా విడివిడిగా నివసిస్తుండటంతో వారి మధ్య సామరస్యపూర్వక పరిష్కారం లేదా సయోధ్య సాధ్యం కాదని ధర్మాసనం భావించింది. ఈ నేపథ్యంలో ఆ వ్యక్తికి విడాకులు మంజూరు చేసింది. అయితే సెటిల్‌మెంట్ కింద భార్యకు రూ. 25 లక్షలు ఇవ్వాలని, రెండు ఫ్లాట్‌ల యాజమాన్యం హక్కులు ఆమెకు బదిలీ చేయాలని ఆ వ్యక్తిని ధర్మాసనం ఆదేశించింది. గతవారం ఈ మేరకు తీర్పు ఇచ్చింది.

# మా జర్నలిస్టుల ప్రాణాలు పోతున్నాయి......కాపాడండి...

**- మంత్రి శ్రీధర్ బాబు, మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ లకు విన్నపించిన రంగారెడ్డి జర్నలిస్టులు**

**అస్త్రం, రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు హెల్త్ కార్డు, అక్రిడిటేషన్ కార్డు మరియు ఇళ్ల స్థలాల మంజూరు చేయాలనీ టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా శాఖ డిమాండ్ చేసింది.రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎండీ సలీమ్ పాషా ల నెత్రుత్వంలో బుధవారం మణికొండ లో మంత్రి శ్రీధర్ బాబు, మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ లకు విన్నపించారు.రంగారెడ్డి జిల్లా పరిధిలో వివిధ ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాలో ఎన్నో సంవత్సరాలుగా అంకిత భావంతో పని చేస్తున్న జర్నలిస్టులు సామాజిక సమస్యలు, ప్రభుత్వ పథకాలు, ప్రజల సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, అత్యవసర పరిస్థితులు వంటి అంశాలను ఎల్లప్పుడూ ముందుండి ప్రజలకు చేరవేస్తున్నారు. ప్రజలతో ప్రభుత్వం మధ్య వారధి పాత్రను భాద్యతగా నిర్వహిస్తున్నారు. అయితే, జిల్లా అంతట పనిచేస్తున్న అనేక మంది జర్నలిస్టులు హెల్త్ కార్డులు , ప్రభుత్వ గుర్తింపు కార్డులు నూతనంగా రాకపోవటంతో మరియు ఇళ్ల స్థలాలు/హౌసింగ్ ప్లాట్లు వంటి మౌలిక ప్రయోజనాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని వారికి వివరించారు.జిల్లాలో ఇప్పటికే పలువురు జర్నలిస్ట్ లు సరైన వైద్య సదుపాయాలు అందకా ప్రాణాలు కోల్పోతున్నారని, హెల్త్ కార్డులతో పాటు, భీమా సౌకర్యం కల్పించాలని కోరారు.ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే బాధ్యత వహిస్తున్న జర్నలిస్టులు కూడా సామాజిక భద్రత, వైద్య సౌకర్యాలు మరియు స్థిరమైన నివాసం వంటి మౌలిక సదుపాయాలు పొందాల్సిన అవసరం చాలాకాలంగా ఉందని ఆ దిశగా ప్రభుత్వం చొరవ చూపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారించాలని కోరారు.హెల్త్ కార్డ్ పని చేయక పోవడం వలన రిపోర్టర్స్ ఇబ్బంది పడుతున్నారన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ వి 6 రిపోర్టర్ నర్సింగ్ రావు గుండె పోటుకు గురై స్టార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని,తక్షణం ఆదుకోవాలని కోరారు.అదేవిదంగా ఉద్యోగుల మాదిరిగా అందరికీ హెల్త్ కార్డ్ అమలు అయ్యేలా చూడాలని



విన్నపించారు.ఇటీవలే షాబాద్ మండలానికి చెందిన రిపోర్టర్ రాములు గుండె పోటుతో మృతి చెందారు.వారి కుటుంబానికి ప్రభుత్వం సహాయం అందించాలని కోరారు. వీటిపై మంత్రి సా నుకూలంగా స్పందించారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా దాడుల నివారణ కమిటీ సభ్యులు భీమయ్య, సీనియర్ నేతలు సూర్యనారాయణ, రాజేందర్ రెడ్డి, రాజు, విష్ణు ల, రాము, శేఖర్ రెడ్డి,నరేందర్, బాలు, లక్ష్మినారాయణ,ఎం విజయ్, తదితరులు ఉన్నారు.

# ఎన్నికలకు ముహూర్తం!

-మొదటిపేజీ తరువాయి

నిర్వహణకు షెడ్యూలు వెలువడే అవకాశం ఉంది. అదే నెలాఖరులోపు పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తిచేసే వీలుంది. డిసెంబరు 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాల తర్వాత పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు మంత్రిమండలి నిర్ణయం నేపథ్యంలో ఈ ప్రక్రియపై రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ, రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి సారించాయి. సోమవారం మంత్రిమండలి భేటీలో 'స్థానిక' ఎన్నికలపై విస్తృతంగా చర్చ జరిగింది. రిజర్వేషన్ల అమలు, రాష్ట్ర హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలు, న్యాయనిపుణుల సలహాలపై పంచాయతీరాజ్‌శాఖ నివేదిక ఇవ్వగా దానిపై మంత్రులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈనెల 24న హైకోర్టులో విచారణ గురించి చెప్పారు. మార్చి 31లోపు పంచాయతీ ఎన్నికలను పూర్తి చేస్తేనే కేంద్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు.

**రెండు రోజుల్లోగా డెడికేటెడ్ కమిషన్ 50 శాతంలోపు రిజర్వేషన్లతో ప్రభుత్వానికి నివేదిక**

రిజర్వేషన్లపై 2 రోజుల్లోగా డెడికేటెడ్-కమిషన్ నుంచి ప్రభుత్వానికి నివేదిక. పార్టీ పరంగా బీసీలకు 42% కోటా ఇచ్చేందుకు ఇప్పటికే కేబినెట్ నిర్ణయం. రాష్ట్ర కేబినెట్ నిర్ణయంతో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ వేగం పుంజుకున్నది. సర్పంచ్, వార్డు మెంబర్ల స్థానాలకు రెండు రోజుల్లోగా డెడికేటెడ్ కమిషన్ 50 శాతంలోపు రిజర్వేషన్లతో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నది. ఈ రిపోర్ట్ ప్రభుత్వానికి అందిన వెంటనే..పంచాయతీరాజ్ శాఖ అన్ని జిల్లాల కలెక్టర్లకు పంపి రిజర్వేషన్లను ఫైనల్ చేసి పబ్లిష్ చేస్తుంది. ఆ తర్వాత ఎన్నికల సంఘానికి రిజర్వేషన్ల గెజిట్ జాబితా ఇచ్చి, ఈ నెల 25వ తేదీ కల్లా పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో ఇటీవల రాష్ట్ర ఎన్నికల సంఘం 50 శాతంలోపు రిజర్వేషన్ల జాబితా ఉండేలా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఆ మేరకే రిజర్వేషన్లు ఖరారు చేసి పంపిస్తామని ఎన్నికల సంఘానికి ప్రభుత్వం స్పష్టం చేసింది. గతంలో నోటిఫికేషన్ ఇచ్చిన టైంలోనే ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సిబ్బంది, భద్రతా ఏర్పాట్లు లాంటివన్నీ సిద్ధంగా ఉన్నాయి. మరోసారి వీటిపై రివ్యూ చేసుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం ముందుకు వెళ్లనున్నది. 3 విడతల్లో సర్పంచ్ ఎన్నికలు:మూడు విడతల్లో సర్పంచ్ ఎన్నికలను నిర్వహించేలా సర్కారు ప్లాన్ చేస్తున్నది. దీంతో ఒక్కో విడత పోలింగ్‌కు ఐదు రోజులలోపే గ్యాప్ ఉండనున్నది. ఈ లెక్కన డిసెంబర్ రెండో వారంలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియను ముగించనున్నట్లు తెలుస్తున్నది. డెడికేటెడ్ కమిషన్ పంచాయతీ ఎన్నికల కోసం గతంలోనే రెండు విధాలుగా రిజర్వేషన్లను ఖరారు చేసింది. ఇందులో ఒకటి బీసీలకు 42 శాతం ఉండగా.. ఇంకో దాంట్లో అన్ని రిజర్వేషన్లు కలిపి 50 శాతం లోపు ఉండేలా రెడీ చేసింది. అయితే ఇప్పటికే సిద్ధంగా ఉన్న 50 శాతంలోపు రిజర్వేషన్ల జాబితాను మరోసారి పరిశీలించి ప్రభుత్వానికి నివేదించనున్నది. వాస్తవానికి పంచాయతీ ఎన్నికలు పార్టీల గుర్తుపై జరగవు. ఆయా అభ్యర్థులకు పార్టీలు మద్దతు మాత్రమే ఇస్తాయి. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేసే స్థానాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించింది.మిగతా పార్టీలపై ప్రభావం:బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ పరంగా తీసుకున్న నిర్ణయం మిగతా పార్టీలన్నింటిపై ప్రభావం చూపనున్నది. అనివార్యంగా ఇతర రాజకీయ పార్టీలు కూడా అదే మార్గాన్ని అనుసరించక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. అసెంబ్లీలో బీసీలకు రిజర్వేషన్ల సందర్భంగా అన్ని పార్టీలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపాయి. ఇప్పుడు ఆ రకంగా అమలు చేయపోతే .. ఆ పార్టీలకు బీసీలు దూరమయ్యే అవకాశం ఉంటుంది. బీసీలకు స్థానిక సంస్థల్లో చట్ట ప్రకారం ఇప్పటికే 22-23 శాతం రిజర్వేషన్లు అమలులో ఉన్నాయి. దీనిని చట్టపరంగా 42 శాతంకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేసింది. చివరకు హైకోర్టు స్టే ఇచ్చింది. సుప్రీంకోర్టు కూడా హైకోర్టు ప్రకారం నడుచుకోవాలని సూచన చేసింది. ఈ క్రమంలో వచ్చే మార్చిలోగా పంచాయతీల్లో పాలక వర్గాలు కొలువుదీరకపోతే ఫైనాన్స్ కమిషన్ నుంచి రావాల్సిన దాదాపు రూ.3 వేల కోట్లు ల్యాప్స్ కానున్నాయి. ఫలితంగా పంచాయతీ ఎన్నికల్లో 50 శాతంలోపే రిజర్వేషన్లతో ఎన్నికలకు ప్రభుత్వం వెళ్తున్నది.

# ఇక డిజిటల్ వాట్సాప్ సేవలు

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు సేవలను మరింత సులభంగా అందించేందుకు ఒక విప్లవాత్మక చర్యగా మీ సేవా సర్వీసులను వాట్సాప్ ప్లాట్‌ఫారమ్‌లో ప్రవేశ పెట్టింది. ఐటీ ,పరిశ్రమల మంత్రి డి. శ్రీధర్ బాబు లాంఛనంగా ఈ సౌకర్యాన్ని ప్రారంభించారు.ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చాలా సేవలను వాట్సాప్ ద్వారా అందిస్తోంది. ఫిర్యాదులు, దరఖాస్తులు వాట్సాప్ ద్వారా చేసుకునే అవకాశం కల్పించింది. ప్రభుత్వ సేవలు చాలా వరకు వాటా?సప్‌లో అందుతున్నాయి. తిరుమల సేవల కూడా వాట్సాప్‌లో అందుబాటులోకి వచ్చాయి. ఇక ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో 'మీ సేవ' సేవలను ఆధునికరించడంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పౌరులు మీ సేవ సెంటర్లకు పదేపదే వెళ్లకుండానే వాట్సాప్ ద్వారా దరఖాస్తుల స్థితి, సర్టిఫికేట్లను నేరుగా చెక్ చేసుకోవచ్చు. దరఖాస్తు ఆమోదం పొందిన వెంటనే సర్టిఫికేట్ లింక్ వాట్సాప్‌లో వస్తుంది. పౌరులు ఆ లింక్ ద్వారా డాక్యుమెంట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ప్రింట్ చేసుకోవచ్చు. ఈ విధానం ద్వారా మీ సేవ సెంటర్లపై ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. పౌర సేవలను వాట్సాప్ ద్వారా అందించడం వల్ల ప్రజలకు సమయం, ప్రయాణ వ్యయం ఆదా అవుతాయి. అదనంగా ఆధికారులకు కూడా పని సులభం అవుతుంది. దరఖాస్తు స్థితి రియల్‌టైమ్‌లో కనబడటంతో అవినీతి అవకాశాలు తగ్గిపోతాయని భావిస్తున్నారు. ఇది రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్‌కు కొత్త ప్రమాణంగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఈ సౌకర్యాన్ని తెలంగాణ ఐటీ, సేవలు శాఖ రూపొందించింది. సేవలు మొబైల్ ఆధారితంగా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇప్పటికే 'తీ?హబ్', 'తీ?వర్క్స్', 'తీ?వాలెట్' వంటి పథకాలను విజయవంతంగా నడుపుతోంది. వాట్సాప్ మీ సేవ అందించడంతో ప్రజల చేతుల్లో ప్రభుత్వం అనే నినాదం మరో అడుగు ముందుకేసినట్లవుతోంది. సాంకేతికతను పాలనలో వినియోగించడం తెలంగాణ ప్రభుత్వానికి కొత్త విషయం కాదు. అయితే వాట్సాప్ వేదికగా ప్రభుత్వ సర్టిఫికెట్ల డెలివరీ ప్రారంభం కావడం దేశవ్యాప్తంగా అందరికీ ఆదర్శంగా మారే అవకాశం ఉంది. మెటా , మీసేవా సంయుక్త భాగస్వామ్యంతో అమలులోకి వచ్చిన ఈ కొత్త వ్యవస్థ, 38 ప్రభుత్వ విభాగాలకు చెందిన 580కి పైగా సేవలను సాధారణ చాట్ ఇంటర్‌ఫేస్ ద్వారా అందుబాటులోకి తెచ్చింది. వాట్సాప్‌లో మీసేవా సేవలు ప్రవేశపెట్టడం ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల చేతిలోకి తీసుకువస్తున్నామని శ్రీధర్ బాబుతెలిపారు. ప్రభుత్వం టెక్నాలజీ ద్వారా సమయాన్ని ఆదా చేసి, పారదర్శకతను పెంచుతుందన్నారు. ఈ సర్వీస్ త్వరలో తెలుగు, ఉర్దూ భాషల్లో అందుబాటులోకి వస్తుందని, వాయిస్ కమాండ్ ఫీచర్‌తో కూడా ప్రజలు సేవలు పొందవచ్చన్నారు. మీసేవా వాట్సాప్ సర్వీసులు అధునాతన కన్వర్సేషనల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) డ్రివెన్ ప్లాట్‌ఫారమ్‌పై ఆధారపడి ఉన్నాయి. ప్రజలు ఒక్క వాట్సాప్ నంబర్‌కు మెసేజ్ పంపితే హాల్ టికెట్లు, వెదర్ ఇన్ఫర్మేషన్, ప్రభుత్వ అలర్ట్‌లు, బస్ టికెట్ బుకింగ్‌లు వంటి సేవలు చాట్ ద్వారానే పొందవచ్చు. మొత్తం 38 ప్రభుత్వ విభాగాలు రెవెన్యూ, రోడ్ ట్రాన్స్‌పోర్ట్, ఎడ్యుకేషన్ మొదలైనవి నుంచి 580కి పైగా సేవలు ఇప్పుడు ఈ ప్లాట్‌ఫారమ్‌లో అందుబాటులో ఉన్నాయి. ప్రత్యేక వాట్సాప్ బిజినెస్ అకౌంట్ నెంబర్‌ను త్వరలో ప్రకటిస్తారు. ఆ నెంబర్‌కు మెసేజ్ పంపితే ఎఐ చాట్‌బాట్ సేవల లిస్ట్ చూపిస్తుంది. సర్వీస్ కోసం కమాండ్ టైప్ చేసి, అవసరమైతే డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. సర్వీస్ పూర్తయిన తర్వాత డిజిటల్ సర్టిఫికెట్ లేదా కన్ఫర్మేషన్ మెసేజ్ వస్తుంది. హాల్ టికెట్లు, వెదర్ అప్‌డేట్‌లు, ప్రభుత్వ అలర్ట్‌లు, బస్ టికెట్ బుకింగ్‌లు మొదలైనవి త్వరలో అందుబాటులోకి వస్తాయి. మీసేవా సెంటర్లకు వెళ్లాల్సిన అవసరం లేదు. స సంవత్సరానికి 1.5 కోట్ల ట్రాన్సాక్షన్లు జరిగే మీసేవా వ్యవస్థకు ఇది భారీ ఊరటగా చెప్పుకోవచ్చు. టెక్నాలజీ ఫలాలను రాష్ట్రంలోని మారుమూల ప్రాంతంలో ఉన్న చివరి వ్యక్తి వరకూ చేర్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని మంత్రి అన్నారు. దేశంలోనే తొలిసారిగా అందుబాటులోకి తెచ్చిన ఏఐ ఆధారిత తెలంగాణ డిజిటల్ ఎక్స్ ఛేంజ్, ఏఐ సిటీ, ఏఐ యూనివర్సిటీ, తెలంగాణ ఇన్నోవేషన్ హబ్ తో 'డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్'లో తెలంగాణ ఒక బెంచ్ మార్కెట్ ను సెట్ చేస్తోందని మంత్రి అన్నారు.మెటా, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా ఈ ప్లాట్‌ఫారమ్‌ను అభివృద్ధి చేశాయి. వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలను సులభంగా అందించడం ద్వారా మేము డిజిటల్ ఇంక్లూజన్‌కు కృషి చేస్తున్నాం. తెలంగాణలో 10 కోట్లకు పైగా వాట్సాప్ యూజర్లు ఉన్నారు, వారందరూ ఇప్పుడు మీసేవా ప్రయోజనం పొందవచ్చు . ఈ సౌకర్యం త్వరలో పూర్తిగా అందుబాటులోకి వస్తుంది.

## శేరిలింగంపల్లి బీఆర్ఎస్ లో చేరికలు...

**- బి.అర్. ఎస్ పార్టీ లో చేరిన కాంగ్రెస్ పార్టీ స్టేట్ జాయింట్ సెకరేటరీ...**

**- లింగంపల్లి షాప్స్ అసోసియేషన్ జనరల్ సేకరేటరీ కె.శంకర్**

**- క్లాసికల్ డాన్స్ టీచర్ మాదాని దివ్య రెడ్డి మరియు కె.రఘునాథ్ రెడ్డి,**



**అస్త్రం, చందానగర్ :** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి సమక్షంలో శేరిలింగంపల్లి బీ.ఆర్.ఎస్ పార్టీ ఇంచార్జి ఎమ్మెల్యే మాధవరం కృష్ణ రావు సూచనలు,సలహా మేరకు,మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జాయింట్ సెక్రటరీ విమల్ కుమార్ మరియు ఇతర కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరటం జరిగినది. బొబ్బ నవత రెడ్డి మాట్లాడుతూ శేరిలింగంపల్లి లో అభివృద్ధి కుంటు పడింది,ప్రజలు సమస్యలతో ఇబ్బందులకు గురి అవుతున్నారు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు,వారూ ఏ పార్టీ లో ఉన్నారో వారికె తెలియని పరిస్థితిలో ప్రజలు అయోమయంలో వున్నారు.ప్రజా సమస్యలను గాలికి వదిలి వారి పదవులను కాపాడుకోవడానికి కృషి చేస్తున్నారు రాబోయే కాలం లో ప్రజల వ్యతిరేకత తో బి.ఆర్.ఎస్ పార్టీ లో పెద్ద ఎత్తున చేరికలు ఉంటాయి అని తెలియచేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మిద్దెల మల్లారెడ్డి,సంగారెడ్డి,వాల హరీష్,పార్నంది శ్రీకాంత్,రవీందర్ యాదవ్,గౌస్,బాబు మల్లేష్ మటియుమల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## బీ కేర్‌ఫుల్!

-మొదటిపేజీ తరువాయి

తీవ్రమైన చలిగాలులు వీచే అవకాశం ఉన్నదని తెలిపింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్-యూలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 6.8 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 7.8 డిగ్రీలు, రాజన్నసిరిసిల్ల జిల్లా రుద్రంగిలో 8.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్టు వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 14 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని, చలిగాలుల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరించారు.

**బంగాళాఖాతంలో వరుస అల్పపీడనాలు**

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 19నాటికి దక్షిణ అండమాన్ సముద్రం మీదుగా ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉన్నదని ప్రకటించింది. దీని ప్రభావంతో ఈ నెల 22న ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని వెల్లడించింది. ఇది వాయుగుండంగా మారే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఈ అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 24 నుంచి 27వరకు తెలంగాణ, కోస్తా, రాయలసీమ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది. చలికి వర్షాలు తోడైతే ప్రజల ఆరోగ్యం దెబ్బతినే అవకాశాలుంటాయని.. చిన్నారులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని తెలిపింది.

## బీజేపీపై తప్పుడు పోస్టులు పెడితే కేసులు పెడతాం

-మొదటిపేజీ తరువాయి

వేశామని అన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తల మీద ఇష్టారీతిన పోస్టులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. బీజేపీపై తప్పుడు పోస్టులు పెడితే కేసులు పెడతామని హెచ్చరించారు. బీజేపీ చిల్లర రాజకీయాలకు భయపడదని ఆయన అన్నారు.

## ఇందిరమ్మే స్ఫూర్తి.. కోటి మందికి చీరలు

-మొదటిపేజీ తరువాయి

మహిళలకు ఇందిరమ్మ చీరలను ప్రభుత్వం పంపిణీ చేయనుంది.
ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో రాజకీయ శూన్యత ఏర్పడిన సమయంలో ఇందిరా గాంధీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం ఎంతో కృషి చేశారు. బ్యాంకుల జాతీయం, అగ్రికల్చర్ ల్యాండ్ సీలింగ్ యాక్ట్ తెచ్చి పేదలకు భూములు పంచినా, పేదలకు ఇండ్లు కట్టించినా అది ఇందిరమ్మకే సాధ్యమైంది. పాకిస్తాన్‌తో యుద్ధం సమయంలో ధీటుగా నిలబడి ఎదుర్కొన్న ధీశాలి ఇందిరమ్మ. దేశానికి బలమైన నాయకత్వం అందించిన ఘనత ఇందిరాగాంధే. ఇందిరమ్మ స్ఫూర్తితో మా ప్రభుత్వం ముందుకు వెళుతోంది. మహిళలకు పెట్రోల్ బంక్‌లు నిర్వహించుకునేలా ప్రోత్సహించాం. ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలని యజమానులను చేశాం. మహిళల సంక్షేమంతో పాటు ఆర్థిక ఉన్నతి కలిగించే కార్యక్రమాలు చేపట్టాం. ఆడబిడ్డల పేరుతోనే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నాం. రాజకీయాల్లోనూ మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించాం. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులని చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం పనిచేస్తుంది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమే కాదు.. ఆర్టీసీ బస్సులకు ఓనర్లను చేశాం. సోలార్ ప్లాంట్ మహిళలకే ఇస్తున్నాం. ఇందిరా గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా పాలన చేస్తున్నాం. మహిళలకు స్థానిక సంస్థల్లో ప్రాతినిథ్యం ఇస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్లు కూడా ఆడబిడ్డలకే ఇస్తున్నాం. తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం తరపున సారె పెట్టి గౌరవించాలని భావించాం. అందుకే కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించాం. ఇందిరమ్మ జయంతి రోజున ప్రారంభించిన ఈ కార్యక్రమం డిసెంబర్ 9 వరకు గ్రామీణ ప్రాంతాల్లో పంపిణీ చేస్తాం. మార్చి 1 నుంచి 8 న మహిళా దినోత్సవం వరకు పట్టణ ప్రాంతాల్లో పంపిణీ చేస్తాం. ఎవరూ ఆందోళన చెందొద్దు.. ప్రతీ ఆడబిడ్డకు చీరను అందిస్తాం. మొదటి విడతలో 65 లక్షల చీరలు పంపిణీ చేయబోతున్నాం. చీరల ఉత్పత్తికి సమయం పడుతున్న నేపథ్యంలో రెండు విడతలుగా చీరలను పంపిణీ చేస్తున్నాం. మహిళా మంత్రులు, మహిళా ఎమ్మెల్యేలు, మహిళా అధికారులు ఇందిరమ్మ చీర కట్టుకోవాలి. మీరే బ్రాండ్ అంబాసిడర్ గా మారి ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటాలి అని పిలుపునిచ్చారు.వైఎస్సార్ హయంలో 25 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టించారని, డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని చెప్పి బీఆర్ఎస్ మోసం చేసింది. రాష్ట్రంలో 4 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నామని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మహిళలను భాగస్వామ్యులను చేస్తున్నామని నేను చెప్పాను. లబ్ధిదారులకు తప్పకుండా ఇళ్లు కట్టిస్తాం. ఇందిరా గాంధీ పాలన దేశానికి దిక్సూచి' అంటూ వ్యాఖ్యలు చేశారు.

## ఇక రైతుల ఇంటికే పాస్ పుస్తకాలు

**మహబూబ్ నగర్ :** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్లు చేసుకున్న దాదాపు 5 వేలకు పైగా రైతులకు గత మూడు నెలలుగా పట్టాదారు పాసుపుస్తకాలు అందడం లేదు. ఈ జాప్యం వల్ల రైతులు బ్యాంకు రుణాలు, రైతు భరోసా, పీఎం కిసాన్ వంటి సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. ఆలస్యమైనా పాసుపుస్తకాలు అందరికీ తపాలా ద్వారా సరఫరా అవుతాయని.. రైతులు ఎలాంటి ఆందోళనలకు గురికావద్దని కొల్లాపూర్ ఆర్డీవో భన్సీలాల్ హామీ ఇచ్చారు.ప్రస్తుతం భూముల రిజిస్ట్రేషన్లు ఎక్కువగానే కొనసాగుతున్నప్పటికీ.. సంబంధిత రైతులకు సకాలంలో పట్టాదారు పాసుపుస్తకాలు అందకపోవడం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాల వ్యాప్తంగా ప్రధాన సమస్యగా మారింది. ఈ ఆలస్యం కారణంగా రైతులు ముఖ్యంగా బ్యాంకుల నుంచి రుణాలు పొందలేక, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత మూడు నెలలుగా భూముల రిజిస్ట్రేషన్లు చేసుకున్న వేలాది మంది రైతులకు పాసుపుస్తకాలు సరఫరా కావడం లేదు.

# ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట:** దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఇల్లందకుంట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ సూచనల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఇందిరా గాంధీ భారత చరిత్రలో చిరస్థాయి ముద్ర వేసిన నాయకురాలని పేర్కొన్నారు. ఆమె పాలనలో రాజభరణాల రద్దు, గరీబీ హటావో, 20 సూత్రాల పథకం, హరిత విప్లవం, బంగ్లాదేశ్ విమోచనం, 1971 ఇండోపాక్ యుద్ధ విజయం వంటి నిర్ణయాలు దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపించాయని అన్నారు. 1966 నుండి 1977 వరకు వరుసగా మూడు పర్యాయాలు, అనంతరం 1980లో నాలుగోసారి ప్రధానమంత్రిగా భారత రాజకీయాలకు విశేష సేవలు అందించిందని గుర్తుచేశారు. ఆమె జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని, ఆలోచనలు, విలువలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు .కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గూడెపు



సారంగపాణి, మార్కెట్ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాస్ రెడ్డి, కనుమల్ల సంపత్, అన్నం ప్రవీణ్, పెద్ది శివకుమార్, కళ్లెం సత్యనారాయణ రెడ్డి, జిల్లెల తిరుపతి రెడ్డి, గోడిషాల పరమేశ్వర్, గోలి కిరణ్, బొమ్మ శ్రీనివాస్, కిషన్ రెడ్డి, మూడెత్తుల మల్లేశం, గోపాల్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు మీస రాజయ్య, గురుకుంట్ల స్వామి, బండి మల్లయ్య, బైరెడ్డి కొండాల్ రెడ్డి, మర్రి వీరారెడ్డి, గడ్డి శ్రీనివాస్, తోడేటి కిషన్, మ్యాడద తిరుపతి రెడ్డి, మేకల సురేష్, మూడెడ్ల రమేష్, గొడుగు మానస, ఆరే రమేష్ రెడ్డి, గైకోటి రాజు, మంకు ఐలయ్య, భోగం పృథ్వి, గుండారపు సాయి, గూడెపు ఓదేలు, మానసాని రవి, పెద్ది అభిలాష్, మరపెల్లి వంశీ, జక్కు కుమార్, రేణుకుంట్ల రవీందర్, కంచర్ల రవి, రాజేశం, జలేందర్ రెడ్డి, తాడేం దిలీప్ తదితరులు పాల్గొన్నారు

# సమాచార హక్కు చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్న అధికారులు..

**సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్**

**సామాన్యుడి అస్రం ప్రతినిధి కమలాపూర్ :** ప్రభుత్వ పాలనలో పాదర్శకతను పెంపొందించి, పరిపాలనా వ్యవహారాల్లో గోప్యతను నివారించి, ప్రభుత్వ పాలనా విధానాలను ప్రజల ముందు ఉంచేందుకు పౌరులకు కల్పించిన అద్భుత అవకాశమే సమాచార హక్కు.ప్రభుత్వ పాలనలో పాదర్శకతను పెంపొందించి, పరిపాలనా వ్యవహారాల్లో గోప్యతను నివారించి, ప్రభుత్వ పాలనా విధానాలను ప్రజల ముందు ఉంచేందుకు పౌరులకు కల్పించిన అద్భుత అవకాశమే సమాచార హక్కు. సమాచారాన్ని ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత అయితే దాన్ని పొందడం పౌరుల హక్కు. ప్రభుత్వ పాలనలో బాధ్యతాయుత విధానానికి అవకాశాన్ని కల్పిస్తుంది. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు అధికారుల పనితీరులో పారదర్శకత పాటించేందుకు తీసుకువచ్చిన సమాచార హక్కు చట్టం ప్రభుత్వ అధికారుల తీరుతో అభాసు పాలవుతుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు సమాచారం ఇచ్చేందుకు సమయం నిర్దేశించి ఇచ్చినప్పటికి అది అమలుకు నోచుకోవడం లేదు. సమాచారం కోసం పెట్టుకున్న దరఖాస్తులు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో కుప్పలు కుప్పలుగా పేరుకుపోయాయని సమాచారం. కోరిన సమాచారం కోసం దరఖాస్తు దారులు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారని, అయినా అధికారుల నుంచి సమాధానం లేకపోవడంతో సమాచార హక్కు చట్టం వివిధ ప్రభుత్వ కార్యాలయంలో అమలు అవుతుందా. లేక ప్రభుత్వ అధికారులను సమాచార హక్కు చట్టం నుంచి ఏమైనా ఉపేక్షించారా.. అనే సందేహాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.

**అసంపూర్తి సమాచారంతో సర్దుబాటు..**

సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చిన మొదట్లో ఎన్నో అవినీతి అక్రమాలు వెలుగు చూసి సామాన్యుడికి అదో బ్రహ్మాస్త్రంలా మారి అక్రమాలకు పాల్పడిన అధికారుల్లో గుబులు పుట్టించింది. మొదట్లో చట్టం అమలులో సైతం అధికారులు పారదర్శకంగా వ్యవహరించేవారు. ఏ అధికారైనా సమాచారం ఇచ్చేందుకు నిరాకరించిన ఇబ్బందికి గురి చేసిన చట్టప్రకారం చర్యలు ఉండేవి ఇప్పుడు పరిస్థితి మారిందని పలువురు అంటున్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా ఏదైనా సమాచారం కోసం దరఖాస్తుదారుడు దరఖాస్తు చేసుకుంటే సంబంధిత అధికారులు సమాచారం ఇచ్చేందుకు నిరాసక్తత చూపిస్తున్నారని, సమాచారం ఇచ్చేందుకు సరిపడా సిబ్బంది లేరని కాలయాపన చేస్తున్నారని, లేదంటే సమాచారం మా వద్ద లభ్యం కావడం లేదంటూ సమాచారం ఇవ్వకుండా తప్పించుకుంటూ అధికారులు ఒక వేల తప్పని పరిస్థితుల్లో ఇవ్వాల్సి వచ్చినా పూర్తి సమాచారం ఇవ్వకుండా అసంపూర్తిగా సమాచారం ఇస్తూ తప్పించుకుంటున్నారని, ఇలా అసంపూర్తి సమాచారంతో దరఖాస్తు దారులు పూర్తి సమాచారం రాబట్టాలంటే నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగక తప్పడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ లోపు పుణ్యకాలం కాస్తా గడచిపోయి అధికారులు మారి ప్రభుత్వాలు మారి తప్పు చేసిన అధికారులు తప్పించుకుంటుండగా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాల అమలులో పారదర్శకత లోపించి ప్రభుత్వం ఖర్చు చేస్తున్న లక్షల రూపాయలు దుర్వినియోగం అవుతూ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు.

**అక్రమాలు వెలుగులోకి రాకూడదనే చట్టం నిర్వీర్యం..**

అధికారులు పాలకుల పనితీరులో పారదర్శకత లోపించి అక్రమాలకు పాల్పడుతుండటంతో సమాచార హక్కు చట్టం నిర్వీర్యం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అయితే, సమాచార హక్కు చట్టం అమలులో ప్రభుత్వాలు సైతం దృష్టి, సారించకపోవడంతో అధికారులు చట్టాన్ని అమలు చేసేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కాగా గత ప్రభుత్వంలో అధికారంలో ఉన్న పెద్దలు ప్రభుత్వాన్ని రాజ్యాంగ బద్ధంగా కాకుండా రాజరిక పాలన లాగా సాగించడంతో చట్టాలు అమలు కాక అడిగేవారు లేక అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి,ఈ నేపథ్యంలో ప్రభుత్వం మారిన అధికారులు తమ పద్ధతులు మార్చుకోకుండా గత ప్రభుత్వంలో వ్యవహరించిన మాదిరిగానే నాయకుల అండదండలతో గత ప్రభుత్వంలో ఎలా వ్యవహరించారో అదే మాదిరిగా ఇప్పుడు కూడా ప్రస్తుత రాజకీయ పెద్దల అండదండలతో ప్రభుత్వ అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం దరఖాస్తుదారులకు ఇస్తే తమ అవినీతి అక్రమాల చిట్టా బయటకు తెలుస్తాయి. కాబట్టే ప్రభుత్వ అధికారులు సమాచారం దరఖాస్తు దారులకు ఇచ్చేందుకు వివిధ సాకులు చూపిస్తూ సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారనే భావన సర్వత్రా వ్యక్తం అవుతుంది.



మరి ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులు సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తారా లేక అవినీతి అక్రమాలు బయటపడకుండా సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తారో వేచి చూడాల్సిందే.

**30 రోజులు గడిచిన సమాచారం ఇవ్వక పోవడానికి గల కారణం ఏమిటో..**

సామాన్య పౌరులు ఏదైనా కార్యాలయంలో సమాచారం అడిగితే సమాచార హక్కు చట్టం ప్రకారం 30 రోజుల్లో ఇవ్వాల్సి ఉండగా సుమారు 50-60 రోజులు గడుస్తున్న సమాచారం ఇవ్వడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు చట్టాన్ని అమలు చేసేందుకు విముఖత చూపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చట్టం అమలు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సమాచార హక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. చట్టం అమలులో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ కఠినంగా వ్యవహరించాలని ఉన్నతాధికారులను ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడకపోతే సమాచార హక్కు చట్టం అమలు కోసం ఉద్యమం చేయక తప్పదని. దీనిపై నిరంతర పోరాటం సాగిస్తామని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్ మరియు సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సభ్యులు అన్నారు,

# హుజూరాబాద్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

**హిందుత్వమే నా శ్వాస,, బండి**

**సామాన్యుడి అస్త్రం కమలాపూర్ :** హుజురాబాద్‌లో జరిగిన బీజేపీ సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఘాటైన వ్యాఖ్యలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టి కాషాయ సమర భేరీ మోగించారు. తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ హిందుత్వ అజెండాను ముందుకు తెచ్చేలా ఆయన ప్రసంగం సాగింది. “హిందుత్వమే నా శ్వాసనా నోటి నుండి హిందుత్వం ఆగిపోతే, నా శ్వాస ఆగిపోయినట్టే” అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. హిందుత్వ వాదంతోనే రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చే వాతావరణం నిర్మిస్తామని తెలిపారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ 4 స్థానాల నుండి 48 స్థానాలకు పెరగడం హిందుత్వ శక్తి వల్లేనని ఆయన స్పష్టం చేశారు.ముస్లిం ఓటు బ్యాంక్‌పై ప్రశ్నించిన బండి సంజయ్ మోదీ ప్రభుత్వం ముస్లిం, క్రిస్టియన్ అనే తేడా లేకుండా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని పేర్కొంటూ “అయినా ముస్లింలు బీజేపీకి ఓటేయడంలేదు ఎందుకు?” అని బండి సంజయ్ ప్రశ్నించారు. “ఎన్నికలొస్తే మసీదుల్లో ప్రతిజ్ఞ చేసి బీజేపీకి వ్యతిరేకంగా ఓటేస్తున్నారు. అలాగైతే 12% ముస్లింలు ఓటు బ్యాంక్ అయితే 80% హిందువుల ఓటు బ్యాంక్ ఎందుకు కాదు?” అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. సర్పంచ్ ఎన్నికలు కేంద్ర నిధులు కాంగ్రెస్‌పై విమర్శలు సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఎన్నుకుంటే పంచాయతీలకు రూపాయి రాదని, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే జరుగుతోందని అన్నారు. “పంచాయతీలకు బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యం” అని బండి సంజయ్ స్పష్టం చేశారు. కాషాయ సమరభేరీ ప్రారంభం కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టే ప్రచారం కాంగ్రెస్ ప్రభుత్వం 2ఏళ్ల పాలనలో చేసిన వైఫల్యాలను ప్రజలకు చూపించేందుకు ఈ నెల 26న కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో భారీగా ‘సంతకాల సేకరణ’ కార్యక్రమాన్ని




నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ వైఫల్యాలను వివరించే కరపత్రాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్, చంద్రశేఖర్ తివారీ సంయుక్తంగా విడుదల చేశారు. ‘కాషాయ సైనికుడు బండి సంజయ్’ గీతం విడుదల కార్యకర్తల్లో ఉత్సాహం

## జమ్మికుంటలో ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



**సామాన్యుడి అస్త్రం జమ్మికుంట :** భారత దేశ మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ శ్రీమతి ఇందిరా గాంధీ జయంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుభ్రంగా, ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో దేశ అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి, నిరుపేద కుటుంబాలకు తోడ్పాటు అందించారని గుర్తుచేశారు. ప్రపంచ దేశాలన్నీ ఆమె ధైర్యసాహసాలకు “ఉక్కు మహిళ” అనే బిరుదు ఇవ్వడం గర్వకారణమన్నారు.అలాగే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆమె పేరుతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేయడం ఇందిరా గాంధీ ప్రజాసేవకు చేసిన గొప్ప గుర్తింపని పేర్కొన్నారు. ఆమె ఆశయాల సాధన కోసం ప్రతి కార్యకర్త కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జమ్మికుంట కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దేశిని కోటి, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ పొనగంటి మల్లయ్య వ్యవసాయ మార్కెట్ ప్రస్తుత వైస్ చైర్మన్ సత్తిరెడ్డి సాయిని రవి, ఎండి సలీం, పూదరి శివకుమార్, రేణుక, పంజాల అజయ్, పాతకాల అనిల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## శిథిల వ్యవస్థలో,ఉన్న సీసీ రోడ్, డ్రైనేజీ కాలువ,,ఎప్పుడైనా కూలిపోతుందన్న భయంతో ప్రజల్లో ఆందోళన



**సామాన్యుడి అస్త్రం కమలాపూర్:** మండలంలోని భీంపల్లి గ్రామ 5వ, మరియు, 6 వ ,వార్డును కలిపే సిసి రోడ్డు పూర్తిగా దెబ్బతిన్న మరియు పాతబడిన డ్రైనేజీ కాలువ ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. రోడ్డు పొరలు ఊడిపోవడం, కాలువ గోడలు బీటలు వేయడం వల్ల ఎప్పుడైనా కూలిపోతాయనే భయంతో స్థానికులు రోజూ భయంతో ప్రయాణిస్తున్నారు. ప్రతి రోజు స్థానిక ప్రజలు విద్యార్థులు చిన్న పిల్లలు వృద్ధులు, ఉపయోగించే ఈ మార్గం చాలా ఇబ్బందికరంగా ఉంది, “ఇలా శిథిలావస్థలో ఉన్న రోడ్డు, కాలువ ఎప్పుడైనా ప్రమాదానికి దారి తీసే అవకాశముంది. ప్రజలు, ప్రయాణించడం ఎంతో భయానకంగా మారింది” అని స్థానికులు ఉవాచ. ప్రజలు వెంటనే అధికారులు స్థలాన్ని పరిశీలించి రోడ్డు, డ్రైనేజీ పునర్నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

## కమలాపూర్‌లో ఇందిరా గాంధీ 108వ జయంతి వేడుకలు



**సామాన్యుడి అస్త్రం కమలాపూర్:** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో, స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ 108వ జయంతి పురస్కరించుకుని కమలాపూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నేతలందరూ ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్, కమిటీ సభ్యులు, సేవాదళ్ మండల అధ్యక్షులు, గ్రామ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.తరువాత నాయకులు స్థానిక ప్రభుత్వాసుపత్రిని సందర్శించి, చికిత్స పొందుతున్న రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఇందిరాగాంధీ సేవలు, దేశ నిర్మాణంలో ఆమె చేసిన కృషిని ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు.

## స్కై కాలేజ్‌లో అధిక ఫీజుల దందాలకు అడ్డుకట్ట హనుమకొండ ఆర్టిఐ టీం జోక్యం



**సామాన్యుడి అస్రం కమలాపూర్ :** హనుమకొండ జిల్లా కేంద్రంలో భీమరం లోని,,స్కై కాలేజ్ నిర్వహణపై మరోసారి అన్యాయ ఫీజులు, విద్యార్థులపై ఒత్తిడి ఆరోపణలు మళ్లీ వెల్లడి అయ్యాయి. కాలేజీలో చదువుతున్న ఇద్దరు పేద విద్యార్థులు ఇప్పటికే ఫీజులు చెల్లించినప్పటికీ, అప్రకటిత బకాయిల పేరుతో టీసీ ఇవ్వడానికి కాలేజ్ యాజమాన్యం నిరాకరించిన ఘటనపై ఆర్టిఐ టీం తక్షణమే స్పందించింది. సమస్యతో బాధపడుతున్న విద్యార్థులు హనుమకొండ ఆర్టిఐ టీంను ఆశ్రయించగా, టీం వెంటనే కాలేజీకి చేరుకుని యాజమాన్యంతో మాట్లాడి పరిస్థితిని పరిశీలించింది. విద్యార్థులకు అన్యాయం జరిగిందని అర్థమైన వెంటనే ఆర్టిఐ సభ్యులు కాలేజ్ అధికారులతో చర్చలు జరిపి విద్యార్థులకు టీసీ అందేలా చర్యలు తీసుకున్నారు.“పేద విద్యార్థులపై ఎలాంటి అన్యాయం జరిగినా మా ఆర్టిఐ టీం ఎప్పుడూ ముందుంటుంది. విద్యా రంగంలో జరుగుతున్న అక్రమాలు మాతో ఆగిపోవు” అని ఆర్టిఐ ప్రతినిధులు తెలిపారు. ఆర్టిఐ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డా. చంటి ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు సూరా స్రవంతి మార్గనిర్దేశనలో సమస్య పరిష్కారానికి వెంటనే కదిలామని టీం సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు ఉమ్మడి వరంగల్ ఇంచార్జ్ మీసాల విజయ్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొంగంటి రాజ్ కుమార్ హనుమకొండ జిల్లా ఇంచార్జ్ జనగాని నాగరాజ్ హనుమకొండ జిల్లా అధికార ప్రతినిధి అరవింద్ అలాగే మరికొందరు ఆర్టిఐ టీం సభ్యులు.

# జర్నలిస్టులను పట్టించుకోకపోతే ఉద్యమమే

**తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఖాజాపాషా (కేపీ)**

**తెలంగాణ వచ్చినా.. ప్రభుత్వాలు మారినా..**

**రాతమారని జర్నలిస్టుల బతుకులు**

**బీఆర్ఎస్ ..కాంగ్రెస్.. ఎవరొచ్చినా ఏమున్నది గర్వకారణం..?**

**జర్నలిస్టులు తెలంగాణ పోరాటం చేయలేదా..**

**అక్రిడియేషన్ కార్డులకు ఎందుకు ఇంత జాప్యం ఎందుకు..?**

**డీఈఓ చెప్పినా వినిపించుకొని విద్యాసంస్థలు..**

**జర్నలిస్టులను కరివేపాకులా నాయకులు వాడుతున్నారు**

**రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల తీరుపై "జర్నలిస్టు కేపీ" సంచలన వ్యాఖ్యలు**

**రాజీలేని పోరాటాల ద్వారానే జర్నలిస్టుల సమస్యల పరిష్కారం**

**చలో జర్నలిస్టుల రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఆందోళన కార్యక్రమం**

**జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి కి వినతి పత్రం సమర్పణ**







**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** తెలంగాణ కోసం ఓవైపు అక్షర పోరాటం చేశాం.. మరోవైపు ఉద్యమంలో పాలుపంచుకున్నాం.. తెలంగాణ వచ్చింది.. ప్రభుత్వాలు మారాయి.. కానీ జర్నలిస్టుల మా రాత మాత్రం మారలేదు.. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా జర్నలిస్టుల బతుకులు తెల్లారుతున్నాయి.. ఇంకా ఎంతకాలం వేడుక చూస్తారు.. అంటూ షాద్ నగర్ సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి ఖాజాపాషా (కేపీ) ప్రభుత్వం పైనా, అధికారుల పైనా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జర్నలిస్టులకు అక్రిడియేషన్ కార్డులు, విద్యా సంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 50% ఫీజు రాయితీ కోరుతూ బుధవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ను ముట్టడించారు. షాద్ నగర్ అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, కార్యదర్శి నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో షాద్ నగర్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, జిల్లా కార్యదర్శి లక్కాకుల రమేష్ కుమార్, ప్రచార కార్యదర్శి నరసింహారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీశైలం ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని డివిజన్ జర్నలిస్టులు పెద్ద ఎత్తున విజయవంతం చేశారు. టిడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శేరిబాయి గణేష్ సైదులు ఆధ్వర్యంలో ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు జరిగిన ఆందోళనలో జర్నలిస్ట్ కేపీ మాట్లాడుతూ రెండేళ్లు దాటిన ఇప్పటిదాకా జర్నలిస్టులకు కొత్త అక్రిడియేషన్ కార్డులు ఇవ్వకుండా స్టిక్కర్లతో కాలక్షేపం చేస్తున్నారని విరుచుకుపడ్డారు. దీనివల్ల జర్నలిస్టు వృత్తి నుంచి తొలగించబడిన వ్యక్తులు కార్డులు ఉపయోగించుకుంటుండగా, కొత్త జర్నలిస్టులకు ఇప్పటివరకు కార్డులు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐఏఎస్ అధికారులు, డి పి ఆర్ ఓ తదితరులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఉప ఎన్నికలు వస్తే హడావిడిగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసి చేతులు దులుపుకున్నారు.. కానీ ఇన్నేళ్లుగా అక్రిడియేషన్ కార్డులు ఇచ్చే విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. పాఠశాలల్లో ఫీజు రాయితీ విషయంలోనూ డీఈవో లేఖలు ఇచ్చిన ప్రైవేటు విద్యాసంస్థలు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నేళ్లుగా రంగంలో ఉంటూ నాయకులకు సేవ చేస్తూ జర్నలిస్టులు సాధించింది ఏమీలేదని అన్నారు. జర్నలిస్టులకు ఫ్లాట్లు ఇస్తామన్న ఆశలు కూడా నీరుగారిపోయాయని పేర్కొన్నారు. మనము సమాజంలో అందరి బాగోగులను పట్టించుకుంటాం.. కానీ మన బాగోగులు ఎవరూ పట్టించుకోరు.. ఇక్కడ కూడా మన సమస్యలు మనమే చెప్పుకోవాలి.. మనమే రాసుకోవాలి.. అంతే తప్ప మనకు ఎవరు మద్దతుగా రారు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు వెంటనే కొత్త అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

**బీఆర్ఎస్.. కాంగ్రెస్ దొందు దొందే..**

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించే విషయంలో గత పది ఏళ్లలో బీఆర్ఎస్ పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిందని జర్నలిస్టు కేపీ అన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రెండేళ్లకు దగ్గర పడుతున్న ఇప్పటివరకు జర్నలిస్టుల సమస్య ల గురించి ప్రస్తావన లేదని అన్నారు. జర్నలిస్టుల విషయంలో రెండు ప్రభుత్వాలు దొందు దొందే అన్నట్టు వ్యవహరించడం దారుణం అన్నారు. గతంలో జర్నలిస్టుల మహాసభకు ముఖ్య అతిథిగా వచ్చిన మంత్రి శ్రీధర్ బాబు ఎన్నో చేస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటిదాకా ఒక్కటి కూడా అమలులోకి రాలేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవచేసి జర్నలిస్టుల సమస్యలను పట్టించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. స్థానికంగా ఎమ్మెల్యేలు కూడా జర్నలిస్టుల అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. చూసేవాళ్ళు జర్నలిస్టుల గురించి గొప్పగా చెప్పుకుంటారని, కానీ వాస్తవంలోకి వస్తే పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా జర్నలిస్టుల పరిస్థితి ఉందని పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యలు తీర్చకపోతే ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ముందుకు తీసుకు వెళ్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి తరలివచ్చిన జర్నలిస్టులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా జర్నలిస్టు రాజేశ్వరి, షాద్ నగర్ జర్నలిస్టులు లక్కకుల రమేష్ కుమార్, నరసింహారెడ్డి, ఆంజనేయులు గౌడ్, సాయినాథ్ రెడ్డి, నరేష్, రాకేష్, మన్సూర్ అలీ ఖాన్, సలీం, కృష్ణ, వారణాసి జగన్, షకీల్, అశోక్, ఖాజా సోహెల్, శ్రీకాంత్, శ్రీనివాస్, భైరమోని మహేష్, అదేవిధంగా జిల్లాలోని ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం, ఆమనగల్, చేవెళ్ల, షాద్ నగర్, తదితర నియోజకవర్గాల జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు..

# జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వాలి.....

**టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతిపత్రం...**

**ఫీజు రాయితీ ఇవ్వని పాఠశాలపై కఠిన చర్యలు ఉంటాయి...**

**జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి జర్నలిస్టులకు స్పష్టమైన హామీ....**

**త్వరలో డిఈవో ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తాం....**



**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల్లో 50% ఫీజు రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి టిడబ్ల్యుజేఎఫ్ నాయకులు జర్నలిస్టులు భారీగా హాజరయ్యారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు గణేష్, ప్రధాన కార్యదర్శి సైదులు, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, మణి కుమార్, రాందాస్, జిల్లా సహాయ కార్యదర్శులు ప్రభాకర్, నర్సింహ్మా, నేషనల్ కౌన్సిల్ సభ్యులు దేవేందర్ , రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఖాజా పాషా, శ్రీనివాస్, తదితరుల తో కలిసి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు అని, జర్నలిస్టులకు నూతన అక్రిడేషన్ కార్డులను ఇవ్వాలని అదేవిధంగా ఇల్లు స్థలాలు హెల్త్ కార్డులు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ కు విన్నవించారు.

**ఫీజు రాయితీ ఇవ్వని పాఠశాలపై కఠిన చర్యలు ఉంటాయి... జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి....**

రంగారెడ్డి జిల్లా పరిధిలో పనిచేస్తు అక్రిడేషన్ కలిగివున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో 50% ఇవ్వాలని గతంలోనే ఆదేశాలు జారీ చేశామని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. త్వరలోనే డిఇఓతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి జర్నలిస్టుల పిల్లలకు స్కూళ్లలో ఫీజు రాయితీ ఇవ్వటానికి నిరాకరిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇచ్చారు. జర్నలిస్టులు తమ పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో రాయితీ దక్కని పక్షంలో నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. రాయితీ నిరాకరించిన పాఠశాలలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. అక్కడేషన్ల అంశానికి వస్తే రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిదని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో నూతన అక్కడేషన్ కార్డులు జారీ చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు చిలువేరు యాదగిరి, జగన్, షాద్నగర్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు రాఘవేందర్, గౌడ్ నరేష్, చేవెళ్ల అధ్యక్షులు రాజు, మహేశ్వరం అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహా, సురేందర్, రాజేందర్ నగర్ అధ్యక్షులు గోపాల్, ఎల్ బి నగర్ అధ్యక్షులు శ్రీ రాములు, జిల్లా ప్రచార కార్యదర్శి నరసింహ రెడ్డి, షాద్నగర్ డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు ఆంజనేయులు గౌడ్ , సాయినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

## రైతులకు అండగా పార్టీ....

**రైతుల పక్షాన, రైతుల సమస్యల పట్ల కోట్లాడేది మాత్రమే....**

**సామాన్యుడు అస్త్రం వైరా :** జూలూరుపాడు మండల కేంద్రంలో పత్తి కొనుగోలు మార్కెట్ కేంద్రాన్ని పరిశీలించిన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పత్తి రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్షతను నిరసిస్తూ ఈరోజు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర , బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు యల్లంకి సత్యనారాయణ, వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు అకాల వర్షాల కారణంగా ఇప్పటికే దిగుబడి రాక అతలాకు తలమవుతున్న రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకునే ఆలోచనలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం లేదు రాష్ట్రవ్యాప్తంగా రైతులు పండించిన పత్తిని అన్ని మార్కెట్లో తేమ శాతంలో సంబంధం లేకుండా, తక్షణమే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ, రాష్ట్రంలో రైతులను అన్ని రకాలుగా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు తొందరలోనే ఉన్నాయని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర గారు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు యల్లంకి సత్యనారాయణ, వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు గారు తెలిపారు ఈ కార్యక్రమంలో యదలపల్లి వీరభద్రం, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చాపలమడుగు రామ్మూర్తి, సొసైటీ డైరెక్టర్లు లకావత్ హేమ్లా, రెడ్డిబోయిన రాము, బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు తాళ్లూరి రామారావు పురస్తపురవు రామకృష్ణ పోతురాజు రామారావు వాంకుడోత్ వెంకన్న, బానోతు శంకర్, మద్దిశెట్టి ప్రకాశ్, మాసినేన్ని శేషయ్య, వడ్డే సత్యనారాయణ, బానోత్ హరిలాల్, ఇల్లంగి తిరుపతి, మంద పుల్లయ్య, బోడా భోజ్యా మరియు తదితరులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు





## ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు కాకతీయ జూనియర్ కళాశాలలో ఏబీవీపీ కార్యకర్తల నిర్వహణలో



**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకొని జమ్మికుంట మండల కేంద్రంలో,

కాకతీయ జూనియర్ కళాశాలలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.నగర కార్యదర్శి నిరుప్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ ఆవాల అనిల్ కుమార్, నాయకులు శశాంక్ తో పాటు పలువురు ఏబీవీపీ కార్యకర్తలు హాజరై ఝాన్సీ లక్ష్మీబాయి వీరోచిత స్ఫూర్తిని స్మరించుకున్నారు. కార్యక్రమంలో మాట్లాడిన నాయకులు, దేశ భక్తి, ధైర్యసాహసాలకు చిహ్నామైన ఝాన్సీ లక్ష్మీబాయి జీవిత చరిత్రను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో దేశభక్తి, సేవా భావం పెంపొందించడమే ఏబీవీపీ లక్ష్యమని వారు పేర్కొన్నారు. విద్యార్థులు, కార్యకర్తలు పాల్గొనేందుకు కళాశాల ప్రాంగణం సందడి చేసింది. చివరగా నాయకులు విద్యార్థులకు పత్రికలు పంచి కార్యక్రమాన్ని ముగించారు.

## చిన్న కోమటిపల్లికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయింపులో అన్యాయం గ్రామస్థుల ఆవేదన



**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట:** ఇల్లందకుంట మండలం: చిన్న కోమటిపల్లి గ్రామ ప్రజలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కేటాయింపులో అన్యాయం జరుగుతోందని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన 186 మంది నిరుపేద లబ్ధిదారులు ఉన్నప్పటికీ, వారికి ఇండ్లు కేటాయించకుండా ఇల్లందకుంట గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించడం విచారకరం మరియు అన్యాయం అని వారు ఆరోపించారు. ఈ నేపథ్యంలో చిన్న కోమటిపల్లి గ్రామ ప్రజలు, మాజీ సర్పంచులు కలిసి ఎంపీడీవో ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "మా గ్రామానికి సరైన సంఖ్యలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలని, లబ్ధిదారుల జాబితాను పునఃసమీక్షించాలని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి" అని కోరారు. గ్రామస్థుల సమస్యలను ఎంపీడీవో కి వివరించారు అవసరమైన చర్యలు తీసుకుంటామని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చినట్టు సమాచారం. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ఘనంగా ఇందిరా గాంధీ జయంతి



**సామాన్యుడి అస్త్రం వలిగొండ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో భారతదేశపు మొట్టమొదటి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ 108 జయంతి సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ శాఖ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పేదవాడి ఆకలి తీర్చిన ఇందిరాగాంధీ

**షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"**

**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరా గాంధీ జయంతి నివాళి**



**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్** గరిబీ హఠావో నినాదంతో దేశంలోని పేదల ఆకలి తీర్చిన ఘనత స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీకే దక్కుతుందని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ "వీర్లపల్లి శంకర్" అన్నారు.భారతదేశ ప్రథమ మహిళా ప్రధానమంత్రి, ఉక్కు మహిళ, దేశ సేవకై తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలు స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా షాద్ నగర్ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, సీనియర్ నాయకుడు అగ్గనూర్ బస్వ, మహ్మద్ ఇబ్రహీం,చెంది తిరుపతి రెడ్డి, గిరిజన ఆదివాసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు నాయక్,కొందుర్గ్ మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణా రెడ్డి,, ఫరూఖ్ నగర్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్,ఖదీర్, ఇసాక్,ముబారక్ అలీ ఖాన్, పాషా, మాధవులు యాదవ్, బచ్చలి నరేష్, అశోక్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు..

# జాబ్ మేళా పేరుతో నిరుద్యోగ యువత ను మోసం చేయటం సింగరేణి యాజమాన్యం కు తగదు

**నిరుద్యోగ ఉపాధి మాటలకే పరిమిత మా...**

**అధికారులు స్థానిక యువతకి స్పష్టమైన ప్రకటన చేయాలి**

**మాజీ జెడ్పిటిసి పాల్వంచ దుర్గ**

**సామాన్యుడి అస్త్రం మణుగూరు:** మణుగూరు ఏరియాలోని ఈనెల 19న మెగా జాబు మేళ అంటూ సింగరేణి కాలరీస్ యాజమాన్యం నిరుద్యోగ యువతీ యువకులను తప్పుదారి పట్టిస్తూ జాబ్ మేళా పేరుతో మోసం చేస్తోందని మాజీ జెడ్పిటిసి పాల్వంచ దుర్గ తీవ్రంగా విమర్శించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, నిరుద్యోగ యువత కోసం నవంబర్ 9న స్థానిక ఎమ్మెల్యే ప్రజా భవన్ క్యాంపు కార్యాలయంలో “మెగా జాబ్ మేళా” పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించిన అధికారులు, మరుసటి రోజే విలేకరుల సమావేశం పెట్టి మరోసారి పెద్ద ఎత్తున పోస్టర్లు విడుదల చేశారని. నవంబర్ 19వ తేదీన పినపాక ప్రాంతంలోని ఏజెన్సీ ఏరియా యువత కోసం జాబ్ మేళా నిర్వహిస్తామని పెద్ద ఎత్తున ప్రచారం చేశారన్నారు. దీంతో తమకు ఉపాధి లభిస్తుందని, ఉపాధి కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్న యువత సుదూర ప్రాంతాల నుండి మణుగూరు వచ్చిన నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళా కోసం ఆశగా ఎదురుచూసిన సింగరేణి అధికారులు ఏ కారణం చెపకుండానే కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రచార ఆర్భాటాలతో పోస్టర్లతో ప్రచార కార్యక్రమం చేపట్టిన అధికారులు జాబ్ మేళా రద్దుకు ఏకారణం చెప్పకుండా ఎలా రద్దు చేశారని ఆమె నిలదీశారు. ఇంత పెద్ద కార్యక్రమం నిలిచిపోయినా, ఏ ఒక్క మీడియా సంస్థ కూడా “ఎందుకు వాయిదా?” అనే ప్రశ్న అడగలేని పరిస్థితి నెలకొనడం బాధాకరమని అభిప్రాయపడ్డారు. అధికారుల ఇచ్చే “”చాయ్‌బిస్కెట్ల” కోసం వాస్తవాలు పక్కన పెట్టి రాయడం సరైంది కాదని ఆయన పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉపాధి కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలనే బాధ్యత మీడియాపైన ఉందనే విషయాన్ని గ్రహించాలన్నారు. నిజాలను నిర్భయంగా ధైర్యంగా వెలుగులోకి తేవాలని, అంతేకానీ సింగరేణి అధికారులకు వత్తాసు పలుకుతూ కొమ్ము కాయటం సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. ఇప్పటికైనా మీడియా ప్రతినిధులు నిరుద్యోగ యువత కోసం పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఇకనైనా స్థానిక సింగరేణి జీయం, ఎమ్మెల్యే స్థానిక నిరుద్యోగ యువత ఉపాధి కోసం కృషి చేయాలని, జాబ్ మేళా సంగతి ఎలా ఉంచితే, స్థానిక ఓబీ కంపెనీ, ఎస్ఎంఎస్ ప్లాంట్, ఏషియన్ పెయింట్ బెల్ట్, సివిల్ వర్క్స్ టెండర్స్, కొత్తగా వచ్చే ఎస్ఎన్పిసి, గెస్ట్ హౌస్ టెండర్లలో ఉపాధి కల్పించడం వారికి మీరిచ్చే బహుమతిగా నిరుద్యోగులు భావిస్తారు అన్నారు.



# ఏన్కూర్ లో ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

**సామాన్యుడి అస్త్రం వైరా :** మాజీ ప్రధానమంత్రి, భారతదేశపు మొట్టమొదటి మరియు ఏకైక మహిళా ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఏన్కూర్ మండల కేంద్రంలో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. సభలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించగా, కాంగ్రెస్ నాయకులు ఆమె సేవల గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ గుగులోత్ లచ్చిరాం నాయక్ మాట్లాడుతూ, 196677 వరకు వరుసగా మూడు సార్లు, 1980లో నాలుగోసారి ప్రధానమంత్రిగా సేవలందించిన ఇందిరాగాంధీ, భారతదేశ ప్రజల సంక్షేమానికి స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. నెహ్రూ ఏకైక కుమార్తెగా, తండ్రి హయాంలో జీతం లేకుండా ప్రధానమంత్రి కార్యదర్శిగా పనిచేసినందుకు ప్రత్యేక గుర్తింపు పొందారని చెప్పారు. తన ప్రధానమంత్రిత్వ కాలంలో రాజభరణలు రద్దు చేయడం, గరీబీ హటావో నినాదాన్ని దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మార్చడం, పేదల కోసం గృహాలు, ఆహార భద్రత, సంక్షేమ పథకాల అమలులో కీలకపాత్ర వహించడం తదితర స్ఫూర్తిదాయక



కార్యకలాపాలను గుర్తుచేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పరిరక్షించడం, దేశ సుభిక్షత కోసం చేసిన కృషి సుస్థిరంగా నిలిచిందని అన్నారు. తన నాయకత్వంలో అమలు చేసిన పథకాలు రాష్ట్రంలో ఇప్పటికీ కొనసాగుతున్నాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పేదలకు పక్కా గృహాలు, రేషన్ కార్డులు వంటి సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ లాలూ నాయక్, మార్కెట్ సెక్రటరీ బజార్, నవీన్, జగన్, బానోత్ నరసింహారావు, ఇస్లావత్ నరసింహారావు, మార్కెట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 28న చలో సూర్యపేట గీతన్న రణభేరి బహిరంగ సభను జయప్రదం చేయండి

**సామాన్యుడి అస్త్రం జనగామ** బూడిది గోపి తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జనగామ జిల్లా అధ్యక్షులు తెలంగాణ రాష్ట్రంలో కల్లు గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని 2023 శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలన్నీ అమలు చేయాలని ఈనెల 28వ తేదీన ఉద్యమాలు పోరాటాల పురిటి గడ్డ సూర్యాపేట పట్టణంలో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న గీతన్న రణభేరి బహిరంగ సభకు జనగామ జిల్లాలోని గౌడ,కల్లుగీత కార్మికులు వేలాదిగా తరలిరావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బూడిద గోపి పిలుపునిచ్చారు ఈరోజు జనగామ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శి బాల్నే వెంకటమల్లయ్య అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడుతు బూడిద గోపి పాల్గొని నవంబర్ 28,29,30 తేదీలలో సూర్యపేట పట్టణంలో జరుగుతున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాలుగవ మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో కల్లు గీత వృత్తి రోజురోజుకు తగ్గుతుందని దినదిన గండం నూరేళ్ల ఆయుషు అన్న చందంగా వృత్తి కొట్టుమిట్టాడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తి చేస్తున్న గీత కార్మికులందరికీ సేఫ్టీ కిట్లు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నటువంటి సందర్భాలు అనేకం ఉన్నాయి .అలాగే చెట్ల మీద నుండి పడి రాష్ట్రవ్యాప్తంగా ఎక్స్గ్రేషియో పెండింగ్లో ఉన్న బాధితులు గత నాలుగు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారు. వీరికి ఇవ్వాల్సిన కేవలం 13 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం దగ్గర లేవా అని ప్రశ్నించారు? అలాగే ఎన్నికలకు ముందు గీత కార్మికులకు ఇస్తున్న పెన్షన్ 4వేలకు పెంచుతామని ఎక్స్గ్రేషియో 5 లక్షల నుండి 10 లక్షల వరకు పెంచుతామని రాష్ట్రంలో కల్లుగీత పూర్తికి ఆటంకంగా ఉన్న బెల్టు షాపులను నిరోధిస్తామని గొప్పగా వాగ్దానం చేశారు. అలాగే జనగామ జిల్లాను సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా పేరు పెడతామని వాగ్దానం చేసి మొట్టమొదటి అసెంబ్లీలో తీర్మానం చేసి గెజిట్లో నోట్ ఫైవ్ చేసి జీవో విడుదల చేయకపోవడం అంటే బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అవమాన పరిచినట్లేరని ఈసందర్భంగా అన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సర్కార్ వెంటనే జనగామ జిల్లాను సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు డిమాండ్ చేశారు. కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం 5 వేల కోట్ల రూపాయలను నిధులను కేటాయించాలని గీత కార్పొరేషన్ నిధులు కేటాయించాలి కార్పొరేషన్ ద్వారా ఇచ్చే తక్షణ సహాయం పెండింగ్లో ఉన్న వాటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈకార్యక్రమం లో కల్లుగీత కార్మిక



సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు కుర్ర ఉప్పలయ్య జిల్లా ఉపాధ్యక్షులు కంకటి రాజయ్య జొన్నగోని శ్రీనివాస్ ఫరీదుల భాస్కర్ బండపల్లి శంకరయ్య జిల్లా సహాయ కార్యదర్శులు బాల్నే ఉమాపతి కుర్ర రాజు బస్వాగాని మహేందర్ బైరగోని బలరాం జిల్లా కమిటీ సభ్యులు యాదండ్ల పరంధాములు గోపగోని యాదగిరి బైరగోని వెంకటయ్య వడ్లకొండ వెంకటేష్ బాల్నే కార్తీక్ మూల కిరణ్ గొల్లపల్లి మురళి పనస శ్రీనివాస్ ముసిగుంపుల సమ్మయ్య సోషల్ మీడియా జిల్లా నాయకులు మూల వైకుంఠం పోతుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

## చీదీరాల వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా జిల్లా ఆస్పత్రిలో వైద్యం కోసం వచ్చిన ప్రజలకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

**సామాన్యుడి అస్త్రం జనగామ** చీదిరాల వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా జనగామ జిల్లా ఆస్పత్రిలో వైద్యం కోసం వచ్చిన ప్రజలకు మహా అన్న సమర్పణ నిర్వహించి ఘనంగా జన్మదిన వేడుకలో జరుపుకున్నారు ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మంతెన మణికుమార్ ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజ్ మాట్లాడుతూ ఈరోజు పుట్టినరోజు జరుపుకుంటున్న చిధిరాల వెంకటేష్ కి జనగామ అమ్మ ఫౌండేషన్ టీం తరఫున జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు జనగామ అమ్మ ఫౌండేషన్ ఆలోచన ఆశయంలో భారతదేశంలో ఆకలి చావులు లేకుండా నియంత్రణ లక్ష్యంగా ప్రతి ఒక్కరు పుట్టినరోజు పెళ్లిరోజు వేడుకల సందర్భంగా మీ మీ గ్రామ స్థాయి పట్టణస్థాయి నియోజవర్గ స్థాయిలో అన్నదానం




చేయాలని నిరాశరాయులకు అనాధలకు నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలని ఇప్పుడున్న ప్రజలు యువత ఒకే వేదిక ఏర్పాటు చేసుకొని సామాజిక సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ప్రజలకు యువతకు పిలుపునిచ్చారు ఈ సేవా కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు పండుగ నరేష్, బింగి నరసింహులు, అప్రోచ్, గుర్రం అనిల్, ఉల్లెంగుల మణీ, సతీష్ కోయడ నాని, తదితరులు పాల్గొన్నారు

## ఆకస్మిక తనిఖీలు చేసిన రాష్ట్ర విద్యాశాఖ అధికారుల బృందం





**సామాన్యుడి అస్త్రం వైరా :** జూలూరుపాడు మండలంలోని పెండ్యాల భాగ్యమ్మ మెమోరియల్ ప్రాథమిక పాఠశాల మరియు పడమటి నర్సాపురం హై స్కూల్ ను సందర్శించడం జరిగినది ప్రభుత్వం వారు ఈ మధ్యకాలంలో 5.0 అనే స్పెషల్ క్యాంపియన్ లో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు పరిశుభ్రంగా ఉండాలి పచ్చదనంతోటి మరుగుదొడ్లు పాఠశాల ఆవరణము తరగతి గదులు ఆఫీసు రూములు పాఠశాల మొత్తం కూడా పరిశుభ్రంతో పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని ఉద్దేశంతోటి 5.0 అనే స్పెషల్ క్యాంపియన్ ఏర్పాటు చేయటం జరిగినది రాష్ట్ర అధికారులు పై పాఠశాలను సందర్శించి పాఠశాలలో పనికిరాని, ఉపయోగపడని వస్తువులను వెంటనే తొలగించవలసిందిగా ఆదేశించడం జరిగినది .తర్వాత రెండు రోజుల్లో అవన్నీ కూడా పరిశుభ్రంగా చేయాలని సూచించడం జరిగినది పడమటి నర్సాపురం హైస్కూల్ నందు రేపు మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను ఏర్పాటు చేయవలసిందిగా సూచించడం జరిగినదిరాష్ట్ర విద్యాశాఖ పరిశీలికరాలు శ్రీమతి కె వెంకట నరసమ్మ జాయింట్ డైరెక్టర్ హైదరాబాద గారు తెలియజేయడం జరిగినది వారి వెంట నాగ రాజశేఖర్, డిస్ట్రిక్ట్ ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్, భద్రాద్రి కొత్తగూడెం విద్యాశాఖ కమ్యూనిటీ కోఆర్డినేటర్ ఎస్కే సైదులు, మండల నోడల్ ఆఫీసర్ పి సంజీవరావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు టి లక్ష్మీ నరసయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి నేతాజీ, సీతారాములు, జిదుల మహేష్, ధరావత్ నవనీత, సాంబశివరావు,జక్కుల శ్రీనివాసరావు పద్మ పాల్గొన్నారు

## ఏన్కూర్ వైకుంఠధామం లో అభివృద్ధి పనులు



**సామాన్యుడు అస్త్రం వైరా :** ఏన్కూరు మండలంలోని వైకుంఠధామం లొ శెట్టిపల్లి నారాయణ బసవమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏన్కూరు వైకుంఠధామం లో చేపడుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీవో భాగ్యశ్రీ బుధవారం ప్రారంభించారు. స్మశాన వాటికలో నాలుగు ఎకరాల స్థలం ఉన్నప్పటికీ ముళ్లపొదలతో అధ్వానంగా ఉండటంతో ఖమ్మానికి చెందిన ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ శెట్టిపల్లి నాగేశ్వరరావు అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చారు. గ్రామస్తుల కోరిక మేరకు ముళ్ళ పొదల తొలగింపు, నీరు నిలవకుండా కాలువల తవ్వకం మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా వైకుంఠధామం అభివృద్ధికి సహకరిస్తున్న వైద్యులు నాగేశ్వరరావుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో ఏఎంసీ సెక్రటరీ బజారు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ట్రస్టు సభ్యులు కడియాల కోటేశ్వరరావు, గ్రామస్తులు కొవ్వూ రి నాగేశ్వరరావు, మేడ ధర్మారావు, ముదిగొండ నాగేశ్వరరావు, మాదినేని నరసింహారావు, దొంతబోయిన నాగేశ్వరరావు, గాంధీ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## అంతర్జాతీయ విలేకరుల దినోత్సవం సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడికి సన్మానం

**సామాన్యుడు అస్త్రం వైరా :** ఏన్కూర్ లో అంతర్జాతీయ విలేకరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుగులోత్ లచ్చిరాం నాయక్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, ఏన్కూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ధీరావత్ సందీప్ కుమార్ నాయక్ ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ లచ్చిరాం నాయక్ మాట్లాడుతూ, స్థానిక సమస్యలను ఎల్లప్పుడూ నిబద్ధతతో ప్రజల ముందుకు తీసుకువస్తూ, సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్న ప్రెస్ క్లబ్ పాత్ర ప్రశంసనీయం అన్నారు. మీడియా సమాజానికి అద్దం లాంటిదని, నిజాయితీతో పనిచేసే జర్నలిస్టులు సమాజ అభివృద్ధికి దారితీస్తారని ఆయన పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమానికి ఏన్కూరు ప్రెస్ క్లబ్ సభ్యులు, స్థానిక ప్రతినిధులు, జర్నలిస్టులు హాజరయ్యారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన అందరికీ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.



## అంతర్జాతీయ విలేకరుల దినోత్సవం సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడికి సన్మానం

**సామాన్యుడు అస్త్రం వైరా** :అంతర్జాతీయ విలేకరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుగులోత్ లచ్చిరాం నాయక్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, ఏన్కూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ధీరావత్ సందీప్ కుమార్ నాయక్ ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ లచ్చిరాం నాయక్ మాట్లాడుతూ, స్థానిక సమస్యలను ఎల్లప్పుడూ నిబద్ధతతో ప్రజల ముందుకు తీసుకువస్తూ, సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్న ప్రెస్ క్లబ్ పాత్ర ప్రశంసనీయం అన్నారు. మీడియా సమాజానికి అద్దం లాంటిదని, నిజాయితీతో పనిచేసే జర్నలిస్టులు సమాజ అభివృద్ధికి దారితీస్తారని ఆయన పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమానికి ఏన్కూరు ప్రెస్ క్లబ్ సభ్యులు, స్థానిక ప్రతినిధులు, జర్నలిస్టులు హాజరయ్యారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన అందరికీ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.



# జమ్మికుంటలో ఆర్థోపెడిక్ సేవలు

**దుర్గా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో అర్థోపెడిక్ సర్జన్ అందుబాటులోకి**

**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** జమ్మికుంట పట్టణంలోని కొండూరు కాంప్లెక్స్, ఎస్బీఐ లైన్‌లో ఉన్న దుర్గా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో త్వరలోనే ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నారని ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ పి. కిరణ్ గౌడ్ వెల్లడించారు. జమ్మికుంట పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో, దేశ ప్రఖ్యాత వైద్య సంస్థ కిమ్స్ ఆసుపత్రిలో పని చేసిన రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్, స్పోర్ట్స్ ఇంజురీస్, పెయిన్ మేనేజ్మెంట్ నిపుణుడు డాక్టర్ తరుణ్ సింగ్ ఈ ఆసుపత్రిలో సేవలు అందించనున్నారని ఆయన తెలిపారు. ఎంబీబీఎస్, ఎంఎస్ (ఆర్తో), కిమ్స్, ఆస్పత్రి , జాయింట్ రిప్లేస్మెంట్ స్పైన్ స్పోర్ట్స్, ఇంజురీస్, అర్హతలు కలిగి, రోబోటిక్ సర్జరీలో ప్రత్యేక నైపుణ్యం



కలిగిన డాక్టర్ తరుణ్ సింగ్ ఇప్పటికే అనేక క్లిష్టమైన కేసులను సఫలీకృతం చేసి ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్నారు. ఆర్థోపెడిక్ సంబంధిత చికిత్సల కోసం ఇంతవరకు ప్రజలు వరంగల్, హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ఇకపై జమ్మికుంట పట్టణంలోనే అత్యాధునిక వైద్యసేవలు



లభ్యమవుతాయని ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. అర్థ్రోస్కోపీ, జాయింట్ రీప్లేస్మెంట్, ఫ్రాక్చర్ కేర్, స్పోర్ట్స్ ఇంజురీస్, నొప్పుల చికిత్స, రోబోటిక్ సర్జరీ వంటి అన్ని రకాల సాధారణ ధరల్లో అందించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి యాజమాన్యం కోరింది.

# పునరుద్పాదక ఇంధన రంగంలో ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ తో సింగరేణి ఒప్పందం

**సింగరేణి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల నిర్మాణం, విద్యుత్ అమ్మకంలో సహకారానికి అంగీకారం**

**సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ సమక్షంలో ఒప్పందం**

**సామాన్యుడి అస్త్రం మణుగూరు :** సింగరేణి సంస్థ పునరుద్పాదక ఇంధన రంగంలో విద్యుత్ ప్రాజెక్టులను పెద్ద ఎత్తున చేపట్టబోతున్న నేపథ్యంలో ప్రముఖ జాతీయ స్థాయి విద్యుత్ ఉత్పాదక సంస్థ ఎన్టీపీసీ వారి అనుబంధ కంపెనీ ఎన్జీఈఎల్ (ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్) తో ఒక కీలక ఒప్పందం కుదుర్చుకుంది. బుధవారం హైదరాబాద్ లో జరిగిన ఒప్పంద కార్యక్రమంలో సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ తో పాటు సంస్థ డైరెక్టర్లు, ఎన్జీఈఎల్ తరఫున ఉన్నతాధికారులు ఆర్. మౌర్య, బిమల్ గోపాల చారి పాల్గొన్నారు. ఒప్పంద వివరాలను సింగరేణి సంస్థ ఛైర్మన్ ఎన్. బలరామ్ వివరిస్తూ సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా పలు పునరుద్పాదక ఇంధన రంగంలో ప్లాంట్లను నెలకొల్పాలని నిర్ణయించిందని, జాతీయ స్థాయిలో విద్యుత్పాదనలో దశాబ్దాల అనుభవం ఉన్న ఎన్టీపీసీ సహకారాన్ని తీసుకోదలచామని, ఎన్టీపీసీ సంస్థ గ్రీన్ ఎనర్జీ ఉత్పాదన కోసం ఏర్పాటు చేసిన ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థతో కీలక ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. సింగరేణి సంస్థ మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని వద్ద 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని, అలాగే సోలార్ విద్యుత్తును 5 వేల మెగావాట్లకు పెంచాలని నిర్ణయించిందని, మణుగూరు వద్ద జియో థర్మల్ పవర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని యోచిస్తోందని, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ కూడా నిర్మించాలన్న లక్ష్యంగా ముందుకు పోతున్నామన్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తి రంగంలో అపార అనుభవం గల ఎన్టీపీసీ తోనూ అనుబంధ సంస్థ అయిన ఎన్జీఈఎల్ కంపెనీ తోనూ ఒప్పందం కుదుర్చుకోవడం ఒక శుభ పరిణామం అన్నారు. గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ ల ఏర్పాటులో సాంకేతిక సహాయం లేదా ఉమ్మడి భాగస్వామ్యం అంశం కూడా పరిశీలిస్తున్నామన్నారు. భవిష్యత్ లో సింగరేణి గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ ల ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్తును విక్రయంలోనూ ఎన్టీపీసీ సహకారం తీసుకోనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ అనుబంధ సంస్థ ఎన్జీఈఎల్ ఉన్నతాధికారి బిజినెస్ డెవలప్మెంట్ హెడ్ బిమల్ గోపాలాచారి, హెడ్ (సివిల్ ఇంజినీరింగ్) ఆర్.ఆర్.మౌర్యలు మాట్లాడుతూ సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు గ్రీన్ ఎనర్జీ రంగంలోకి కూడా ప్రవేశించడం ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. తాము కూడా గ్రీన్ ఎనర్జీ వైపు వేగంగా అడుగులు



వేస్తున్నామని ఇరువురి పరస్పర సహకారం మరియు భాగస్వామ్యంతో దేశ విదేశాల్లో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ లు ఏర్పాటు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒప్పందం అనంతరం ప్రాజెక్టుల వారీగా సమీక్ష నిర్వహిస్తామని ఇరు పక్షాలకు లాభదాయకమైన ప్రాజెక్టులను ఎంపిక చేసి నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. 13 దశాబ్దాల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణితో కలిసి నడవడం ఆనందంగా ఉందని అన్నారు. సింగరేణి డైరెక్టర్ ఈ అండ్ ఎం ఎం. తిరుమలరావు, ఈడీ (ఎన్టీపీపీ) చిరంజీవులు, జీఎం (కోఆర్డినేషన్, మార్కెటింగ్) తాడబోయిన శ్రీనివాస్, జీఎం విశ్వనాథ రాజు తదితరులు పాల్గొన్నారు.

# క్వారీ వల్ల నష్టపోతున్నామని ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేసినందుకు గ్రామ బహిష్కరణ



**దిరిసిన పల్లి గ్రామ పెద్దలు పై బహిష్కరణ బాధితులు ఫిర్యాదు.**

**సామాన్యుడి అస్త్రం రంపచోడవరం.** నరసాపురం దిరిసిన పల్లి గ్రామ పరిధిలో గల నల్లరాయి క్వారీల వలన తమ నివాసగృహాలు ధ్వంసం అవుతున్నాయని, గృహ పరికరాలు పగిలిపోతున్నాయని, బాంబు బ్లాస్టింగ్ వలన దుమ్ము వచ్చే పొగ వలన ఆరోగ్యానికి హాని జరుగుతుందని కావున న్యాయం చేయాలని కోరుతూ ఈనెల 17/11/2025 సోమవారం నాడు రంపచోడవరం ఐటీడీఏ పీవోకు దిరిసిన పల్లి గ్రామానికి చెందిన బాధితులు ఫిర్యాదు చేయగా గ్రామ పెద్దలు అందరు కలిసి ఫిర్యాదు చేసిన బల్లెం చిన్నలు దొర కుటుంబాన్ని గ్రామ పెద్దలు బుధవారం నాడు బహిష్కరిస్తున్నట్టు బహిరంగంగా ప్రకటించడం జరిగింది. జరిగిన ఈ అన్యాయంపై బాధితులు రంపచోడవరం ఎస్పై , ఐటీడీఏ ఏపీవో వారికి మరియు రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నేరుగా ఫిర్యాదు చేయడం జరిగింది. అలాగే జిల్లా ఎస్పీ, మరియు రంపచోడవరం డిఎస్పి వారికి వాట్సాప్ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బాధితురాలు బల్లెం గంగాభవాని మాట్లాడుతూ తమ నివాస గృహాలు క్వారీలో బాంబ్ బ్లాస్టింగ్ వలన కూలిపోయే దశకు వచ్చాయని గ్రామ పెద్దలకు



అనేకమార్లు చెప్పినప్పటికీ పట్టించుకోకపోగా క్వారీ నిర్వాహకులతోటి డబ్బులకు ఒప్పందం పెట్టుకుని, నష్టపోతున్నటువంటి కుటుంబాలకు అన్యాయం చేస్తూ వచ్చారని, మాకు జరుగుతున్న నష్టం గురించి ఐటిడిఏ పిఓ కు ఫిర్యాదు చేసినందుకు మా కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేశారని ఆవేదన వ్యక్తపరిచారు. సమస్యను పరిష్కరించాల్సిన గ్రామ పెద్దలే గ్రామ బహిష్కరణ చేస్తే మేము ఏం చేయాలని తమ ఆవేదాన్ని తెలియజేశారు. అధికారులు మాకు న్యాయం చేయాలని వెలివేసిన గ్రామ పెద్దలపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ బాధితులకు అండగా నిలబడటం జరిగింది. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ గ్రామ బహిష్కరణ అనేది చట్టరీత్యా నేరమని, సమస్యలు చెప్పుకున్న గ్రామస్తులు పై కక్షపూరితంగా మూడు రోజుల నుంచి మానసికంగా హింసిస్తూ సమావేశాలు పెడుతూ దుర్భాషలాడుతూ చివరికి 20,000 కట్టాలని డిమాండ్ చేయగా, డబ్బు కట్టలేమని మాకు అన్యాయం జరుగుతున్నందుకే పిఓ గారికి ఫిర్యాదు చేశామని



బాధితులు చెప్పగా, గ్రామ పెద్దలు ధిక్కరించి పిఓపి ఫిర్యాదు చేసినందుకు గ్రామ బహిష్కరణ చేస్తున్నామని గ్రామ పెద్దలు చెప్పటం సరికాదని ఇందుకు గ్రామ పెద్దలు చట్టపరంగా శిక్షించబడతారని అధికారులు సీరియస్గా తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. గ్రామస్తులు అందరు కలిసి ఉండటమే తమకు కావాలని, అన్యాయాన్ని కలిసి ప్రశ్నిస్తే వారి గ్రామ సమస్య పరిష్కరించబడుతుందని గ్రామ పెద్దలు పునరాలోచన చేసుకొని ఇటువంటి సంఘటనలు జరగకుండా చూసుకోవాలని ఆయన హితవు పలికారు. అధికారులు స్పందించకపోతే ఈ విషయంపై న్యాయస్థానాన్ని బాధితులు తరఫున ఆశ్రయిస్తామని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. క్వారీ వల్ల నష్టపోయిన కుటుంబాలకి తగిన న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ కోఆర్డినేటర్ పీఠ ప్రసాద్, డివిజన్ ప్రధాన కార్యదర్శి చోడి ప్రదీప్ కుమార్ దొర, కంగాల అబ్బాయి దొర, అరుణ కుమారి, దేవి, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల సుందరీకరణ,అభివృద్ధి పనులపై అధికారులతో ఎమ్మెల్యే గాంధీ సమీక్షసమావేశం

**అస్త్రం, శేరిలింగంపల్లి / చందానగర్:** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న చెరువుల సుందరీకరణ, సంరక్షణ,అభివృద్ధి పనులపై బుధవారం వివేకానంద నగర్ లోని ఎమ్మెల్యే గాంధీ కార్యాలయంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్,,ఇరిగేషన్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే గాంధీ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ చెరువుల సుందరీకరణ,అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, నిర్ణిత సమయంలో చెరువులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.చెరువులను స్వచ్ఛందంగా దత్తత తీసుకొని సీఎస్ఆర్ నిధులతో సుందరీకరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. పటేల్ చెరువు , గంగారాం పెద్ద



చెరువుల సుందరీకరణ భాగంగా న్యాయ చిక్కులు ఉండడంతో కేసు కోర్టు పరిధిలో ఉండటం వల్ల, అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడింది అని అన్నారు. న్యాయ ప్రక్రియను వేగవంతం చేయడం వంటి చర్యలు తీసుకోవాలి,టీడీఆర్ వంటి అంశాలు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూసి చెరువుల అభివృద్ధి పనులు త్వరితగతిన ప్రారంభించాలని అధికారులకు ఎమ్మెల్యే గాంధీ సూచించారు.చెరువులలో కలుషిత నీరు కలవకుండా చేపడుతున్న డ్రైనేజి వ్యవస్థ మళ్లింపు పనులు వేగం పెంచాలని, పనులు నాణ్యత ప్రమాణాల తో చేపట్టాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు ఈఈ మల్లేష్, డీఈ రాజశేఖర్, ఈఈ గులాం మహమ్మద్, ఏఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ పేలి గాయలతో సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న క్షత గాత్రులను పరామర్శించిన జనగామ ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్ రెడ్డి



**సామాన్యుడి అస్త్రం జనగామ** సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరులో గ్రామానికి చెందిన శెట్టె భాస్కర్ కుటుంబం వంట గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో గాయాల పాలయి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేరినప్పుడు అక్కడ ఉన్న వైద్యులతో చర్చించి మెరుగైన వైద్య కోసం సికింద్రాబాద్ గాంధీ అసువత్రి లోని బర్న్స్ వార్డుకు తరలించిన పిమ్మట ఈరోజు ఉదయం గాంధీ ఆసుపత్రి చేరుకొని వారి యొక్క ఆరోగ్య పరిస్థితి గురించి చికిత్స చేస్తున్న వైద్యులతో చర్చించి క్షతగాత్రులను పరామర్శించారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే

## జాతీయ పురస్కారం అందుకున్న జనగాం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ పాషా నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారి సన్మానించడం జరిగింది



**సామాన్యుడి అస్త్రం జనగామ** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాల్ సంజయ్ జన్ భాగీదరి దక్షిణ భారతదేశంలో 2 వ స్థానం జనగామ జిల్లాకు లభించింది అందుకు ఢిల్లీలో అవార్డు ప్రశంస పత్రాన్ని అందుకున్న జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కి కలెక్టరేట్ నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారు కలెక్టర్ రిజ్వాన్ పాషా అవార్డు తీసుకున్నందుకు శుభాకాంక్షలు తెలపడం జరిగింది జనగాం జిల్లాలో జల సంరక్షణ కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేసినందుకు కేంద్ర ప్రభుత్వం జల శక్తి మంత్రి శాఖ సి ఆర్ పటేల్ చేతుల మీదుగా అవార్డు జనగాం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ పాషా అందుకున్నారు జల పురస్కారం కింద కోటి రూపాయలు తీసుకోవడం జరిగింది

## జనగామ అమ్మ ఫౌండేషన్




**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ అమ్మ ఫౌండేషన్ ఆఫీస్ భగత్ సింగ్ సంజయ్ నగర్ లో జనగామ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత తొమ్మిది సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలను అభినందించిన బిజెపి సీనియర్ నాయకులు పిట్టల సత్యం మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా జనగామ అమ్మ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు ఎంతో మంది నిరుపేదలకు నిరాశ్రయులకు నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారని సేవా కార్యక్రమాలు ఇంకా విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లేలా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ని అభినందించారు ఈ సందర్భంగా ట్రాన్స్ జెండర్స్ జనగామ జిల్లా అధ్యక్షులు ఓరుగంటి ఉష మాట్లాడుతూ జనగామ అమ్మ ఫౌండేషన్ చేసే సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎప్పటికి ఉంటుందని జనగామ జిల్లా కేంద్రంగా జనగామ అమ్మ క్యాంటీన్ నిర్వహిస్తున్న కార్యక్రమానికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ట్రాన్స్ జెండర్ మారపాక ఆకాంక్ష, తదితరులు పాల్గొన్నారు

## సాయిబాబా ఆలయంలో కార్పొరేటర్ రాగం ప్రత్యేక పూజలు



**అస్త్రం, శేరిలింగంపల్లి:** కార్తీకమాసం చివరి రోజును పురస్కరించుకుని శేరిలింగంపల్లి డివిజన్ లోని రాజీవ్ గృహకల్ప శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని బాబాని దర్శించుకున్నారు. అనంతరం స్థానికవాసులతో కలిసి అభిషేకం, అర్చన కార్యక్రమాలలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక హారతి ఇచ్చి ఆలయ పరిసరాల్లో కొంతసేపు భక్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ కార్తీకమాసం ఆధ్యాత్మికతకు ప్రతీకగా కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా, ఇటీవలే ఆలయ మిగిలిన అభివృద్ధి పనులపై ఆలయాన్ని సందర్శించానని తెలిపారు. వీటిని పరిశీలించి సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకుంటానని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం ఏర్పాటుచేసిన అన్నప్రసాద వితరణలో పాల్గొని భక్తులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ శ్రీకళ వెంకటేశ్వర్లు, హరి, ప్రవీణ్, వెంకటేష్, నాగరాజు, రమా, నాగేందర్, ఎల్లేష్, భాగ్యలక్ష్మి, లక్ష్మి, సుధారాణి, కుమారి, రోజారాణి, దేవి, రాంబాబు, మోహన్ రావు, భద్ర, స్థానికవాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# మరో మోసం.. మొన్న అదితీ ఇప్పుడు శ్రియ

టెక్నాలజీ పెరిగిపోయిన తర్వాత ఏది నిజమో ఏది అబద్ధమో అర్థం కావట్లేదు. ఎందుకంటే మన పేరుని, ఫోన్ నంబర్లని ఎంతలా మోసాలకు ఉపయోగిస్తున్నారో చూస్తూనే ఉన్నాం. ఇప్పుడు టాలీవుడ్ హీరోయిన్లు కూడా ఇలాంటి ఓ స్కామ్ బారిన పడుతున్నారు. రెండు రోజుల క్రితమే హీరోయిన్ అదితీ రావు హైదరీ తన పేరుతో వాట్సాప్‌లో మోసం జరుగుతుందని బయటపెట్టగా.. ఇప్పుడు ఇదే తరహాలో తన పేరుతోనూ జరుగుతోందని శ్రియ పోస్ట్ పెట్టింది. ఇప్పుడు ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. బుధవారం ఉదయం శ్రియ ఓ పోస్ట్ పెట్టింది. ఇందులో ఓ తన ఫొటోతో ఉన్న ఫోన్ నంబర్ స్క్రీన్ షాట్ తీసి పెట్టింది. ఇది తన నంబర్ కాదని, తన పేరుతో సెలబ్రిటీలకు మెసేజ్ చేసి వాళ్ల టైమ్ వేస్ట్ చేయొద్దని పేర్కొంది. తాను అభిమానించే వ్యక్తులకు.. కలిసి సినిమాలు చేయాలని ఉందని చెబుతూ సదరు వ్యక్తి ఫేక్ వాట్సాప్ ఖాతా నుంచి మెసేజులు పెడుతున్నాడని, ఇది తన దృష్టికి వచ్చిందని చెప్పుకొచ్చింది. దీనిపట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. శ్రియ కెరీర్ విషయానికొస్తే అప్పట్లో తెలుగు, తమిళ, హిందీలో హీరోయిన్‌గా చేసింది. ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్ట్, ఐటమ్ సాంగ్స్ చేస్తోంది. ఈ ఏడాది 'మిరాయ్'లో తల్లిగా ఆకట్టుకుంది. ప్రస్తుతం 'నాన్ వయలెన్స్' అనే తమిళ మూవీ చేస్తోంది.

# నాకు లవ్‌స్టోరీ సినిమాలంటే పిచ్చి ఇష్టం: నాగచైతన్య



"ఒక నటుడిగా, ప్రేక్షకుడిగా నాకు లవ్‌స్టోరీ సినిమాలంటే పిచ్చి ఇష్టం. కోవిడ్ తర్వాత అందరూ యాక్షన్ , సినిమాటిక్ యూనివర్స్, కొత్త వరల్డ్ నేపథ్యంలో వచ్చే సినిమాలకే ప్రేక్షకుల ఆదరణ ఉంటుందని చెప్పారు. కానీ ప్రేమకథలు థియేటర్స్‌లోకి వస్తే, విజయాలు సాధిస్తాయని ఇటీవల మరోసారి ప్రూవ్ అయ్యింది. లవ్‌స్టోరీస్ టైమ్‌లెస్" అని చెప్పారు నాగచైతన్య. ప్రియదర్శి, ఆనంది జంటగా, సుమ కనకాల కీలక పాత్రలో నటించిన చిత్రం 'ప్రేమంటే..'. నవనీత్ శ్రీరామ్ దర్శకత్వంలో రానా సమర్పణలో పుస్కూర్ రామ్మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు నాగచైతన్య, దర్శకుడు శేఖర్ కమ్ముల ముఖ్య అతిథులుగా హాజరై, బిగ్ టికెట్‌ను లాంచ్ చేశారు. తొలి టికెట్‌ను రూ.లక్షా పదహారువేల నూటపదహార్లకు కడివేలు సాయి కొనుగోలు చేశారు. నాగచైతన్య మాట్లాడుతూ%-% "ఇండస్ట్రీలో ఉన్న విలక్షణ నటుల్లో ప్రియదర్శి ఒకరు. స్మాల్, బిగ్ బడ్జెట్ చిత్రాలు.. హారర్, కామెడీ, యాక్షన్ , లీడ్ యాక్టర్, హీరో... ఇలా తను ఒక మంచి కెరీర్‌ను బిల్డ్ చేసుకున్నాడు. నవనీత్ ఓ ఫ్రెష్ లవ్‌స్టోరీతో ఆడియన్స్ ముందుకు వస్తున్నందుకు హ్యాపీగా ఉంది. సుమగారు యాక్ట్ చేయడం ఓ సర్‌ప్రైజ్. ఈ టీమ్ అందరికీ శుభాకాంక్షలు" అని చెప్పారు. "ప్రియదర్శి మంచి సినిమాలు చేస్తూ వస్తున్నాడు. నవనీత్ టెన్షన్ లేకుండా కనిపిస్తున్నాడు. సినిమా బాగా వచ్చిందనుకుంటున్నాను. చిన్న సినిమాలు బాగా ఆడుతున్న టైమ్ ఇది. ఈ యంగ్ టీమ్ చేసిన ఈ చిత్రం సక్సెస్ సాధిస్తుందని ఆశిస్తున్నాను" అన్నారు శేఖర్ కమ్ముల. "ఏషియన్స్ ప్రొడక్షన్స్ హౌస్ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థలో నేను సినిమా చేసే అవకాశాన్ని ఫ్యాన్స్ ప్రేమ వల్లే పొందగలిగాను" అన్నారు ప్రియదర్శి. "పెళ్లయిన తర్వాత ఎంత కొట్లాడుకున్నా, ఎంత అరుచుకున్నా, ఒక చాయ్ తాగుతూ మాట్లాడుకుని ఎలా సాల్వ్ చేసుకోవచ్చు' అన్నదే ఈ సినిమా కథ" అని తెలి?రు నవనీత్. తెలుగు పరిశ్రమలోనివారిపై సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నవారిని హైపర్ ఆది విమర్శించారు. నిర్మాతలు సురేష్‌బాబు, జాన్వీ నారంగ్ మాట్లాడారు.

# భారత్ స్వదేశంలో ఆధిపత్యం కోల్పోతుంది.. టర్నింగ్ పిచ్‌లపై ఆస్ట్రేలియా కెప్టెన్ అలిస్సా హీలీ సంచలన వ్యాఖ్యలు..

స్వదేశంలో టెస్టుల్లో భారత జట్టు ఆధిపత్యం తగ్గుతున్నది. ఇటీవల వరుస సిరీస్‌లో ఓటమిపాలైంది. తాజాగా పిచ్‌లపై దేశీయంగా, విదేశాల్లోనూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోల్‌కతా ఈడెన్ గార్డెన్ వేదికగా జరిగిన టెస్ట్‌లో భారత జట్టు టర్నింగ్ పిచ్‌ను సిద్ధం చేసింది. స్పిన్‌తో ఆతిథ్య జట్టు దక్షిణాఫ్రికాను బోల్తా కట్టించాలనుకున్న టీమిండియా వ్యూహం బెడిసికొట్టింది. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేకపోయి ఓటమిపాలైంది. అయితే, భారత వికెట్లపై ఆస్ట్రేలియా వుమెన్ క్రికెట్ జట్టు కెప్టెన్ అలిస్సా హీలీ స్పందించారు. తొలిరోజు నుంచే తీవ్రమైన టర్న్ ఇస్తున్న ఇలాంటి పిచ్‌లు భారత్‌కే ఇబ్బందులు తెస్తాయన్నారు. సౌతాఫ్రికాతో జరిగిన ఈడెన్ టెస్టులో భారత్ 30 పరుగుల తేడాతో ఓడిపోవడాన్ని ఉదాహరణగా పేర్కొన్న హీలీ.. స్వదేశంలో బ్యాటర్లు సైతం నిలబడలేని వికెట్లు సిద్ధం చేయడం భారత వ్యూహంలో లోపంగా అభిప్రాయపడ్డారు. 'ఇలాంటి పిచ్‌లపై ఆడటం ప్రపంచవ్యాప్తంగా ఎవరికైనా కష్టం. చిన్నప్పటి నుంచే స్పిన్ పిచ్‌లపై ఆడిన భారత ఆటగాళ్లకే ఇప్పుడు సవాలుగా మారుతోంది. అప్పుడు ఇలాంటి తీవ్రమైన టర్నింగ్ వికెట్లు ఎందుకు?' అంటూ ఆమె ప్రశ్నించారు. 'విలో టాక్ క్రికెట్' పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన హీలీ, నేటి క్రికెట్‌లో స్పిన్‌ను ఎదుర్కోవడం మరింత క్లిష్టమవుతోందన్నారు. ఈ నేపథ్యంలో భారత్ స్పిన్‌కు అతిగా సహకరించే పిచ్‌లు సిద్ధం చేస్తే, దాని ప్రభావం వారి జట్టుపైనే పడుతోందని ఆమె హెచ్చరించారు. న్యూజిలాండ్‌తో జరిగిన టర్నింగ్ పిచ్‌లపై జరిగిన టెస్టుల్లో కూడా భారత బ్యాటర్లు తీవ్రంగా ఇబ్బంది పడ్డారని







గుర్తుచేసిన హీలీ.. 'ఫ్లాట్ వికెట్లు ఉంటే భారత జట్టు వరుస పరాజయాల నుంచి బయటపడగలదు' అని సూచించారు. అలాగే జడేజా, కుల్దీప్, వాషింగ్టన్, అక్షర్ వంటి భారత స్పిన్నర్లు స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకుని బౌలింగ్ చేసినప్పుడు మరింత ప్రమాదకరంగా ఉంటారని ఆమె వ్యాఖ్యానించారు. 'పిచ్ అతిగా తిరిగితే భారత స్పిన్నర్ల సహజ శైలి దెబ్బతింటుంది. అంతేకాదు, ఇలాంటి వికెట్లు ప్రత్యర్థి బౌలర్లకూ మ్యాచ్‌లోకి వచ్చే అవకాశం ఇస్తాయి. స్వదేశంలో భారత్ టెస్టులు కోల్పోవడానికి ఇదే కీలక కారణం' అని హీలీ విశ్లేషించారు.

## అగ్రస్థానం కోల్పోయిన రోహిత్ శర్మ .. వన్డే బ్యాటర్లలో కివీస్ ప్లేయర్‌కు ఫస్ట్ ర్యాంక్



**దుబాయ్:** వన్డే బ్యాటింగ్ తాజా ర్యాంకుల్లో భారత ఓపెనర్ రోహిత్ శర్మ అగ్రస్థానాన్ని కోల్పోయారు. బ్యాటింగ్ ర్యాంకుల్లో అతను రెండో స్థానానికి పడిపోయాడు. న్యూజిలాండ్‌కు చెందిన డారిల్ మిచెల్ .. ఐసీసీ వన్డే బ్యాటర్స్ ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానంలో నిలిచాడు. వన్డే బ్యాటర్లలో టాప్ ప్లేస్‌కు చేరుకున్న రెండో న్యూజిలాండ్ బ్యాటర్‌గా నిలిచాడతను. వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను అద్భుతమైన సెంచరీ చేశాడు. కరీబియన్ జట్టుతో జరుగుతున్న వన్డే సిరీస్ తొలి మ్యాచ్‌లో అతను సెంచరీ చేశాడు. వన్డేల్లో అతనికి ఇది ఏడో సెంచరీ. ప్రస్తుతం మిచెల్‌కు 782 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. రోహిత్ శర్మ కన్నా ఓ పాయింట్ ఎక్కువ ఉన్నాడతను. 1979లో కివీస్ బ్యాటర్ గ్లెన్ టర్నర్ ఒక్కడే ఆ దేశం తరపు నుంచి వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్ ప్లేస్‌లో నిలిచాడు. కివీస్ మాజీ క్రికెటర్లు మార్టిన్ క్రోవ్, ఆండ్రూ జోన్స్, రోజర్ టౌస్, నాథన్ ఆస్టిల్, కేన్ విలియమ్సన్, మార్టిన్ గుప్తిల్, రాస్ టేలర్.. టాప్ అయిదు ర్యాంకుల్లో మాత్రమే నిలిచారు. తాజా ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘన్ బ్యాటర్ జర్దాన్ మూడవ స్థానంలో గిల్ నాలుగవ, కోహ్లీ అయిదో స్థానంలో నిలిచారు.

## స్పోర్ట్స్

## న్యూజిలాండ్‌తో రెండో వన్డే.. షాయ్ హోప్ మహోగ్రరూపం



న్యూజిలాండ్ పర్యటనలో వెస్టిండీస్ వన్డే సిరీస్‌ను కూడా కోల్పోయింది. తొలుత ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 1-3 తేడాతో చేజార్చుకున్న కరీబియన్ జట్టు.. తాజాగా మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 0-2 తేడాతో కోల్పోయింది. నేపియర్ వేదికగా ఇవాళ (నవంబర్ 19) జరిగిన రెండో వన్డేలో 5 వికెట్ల తేడాతో పరాజయంపాలైంది. వర్షం కారణంగా 34 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో విండీస్ కెప్టెన్ వీరంగం చేశాడు. కివీస్ బౌలర్లను ఊచకోత కోస్తూ, విధ్వంసకర శతకం బాదాడు. కేవలం 69 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 109 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఫలితంగా తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ 9 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. విండీస్ ఇన్నింగ్స్‌లో హోప్ 109 పరుగుల తర్వాత రెండో అత్యధిక స్కోర్ కేవలం 22 పరుగులు మాత్రమే. అకీమ్ అగస్ట్, జస్టిన్ గ్రీవ్స్, రొమారియో షెపర్డ్ తలో 22 పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లలో మాథ్యూ ఫోర్డ్ (21), రూథర్‌ఫోర్డ్ (13) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. న్యూజిలాండ్ బౌలర్లలో నాథన్ స్మిత్ 4, జేమీసన్ 3, టిక్నర్, సాంట్నర్ తలో వికెట్ తీశారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనకు దిగిన న్యూజిలాండ్‌కు ఓపెనర్లు డెవాన్ కాన్వే (90), రచిన్ రవీంద్ర (56) అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. ఆఖర్లో టామ్ లాథమ్ (39 నాటౌట్), మిచెల్ సాంట్నర్ (34 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌లతో చెలరేగడంతో న్యూజిలాండ్ మరో 3 బంతులు మిగిలుండగానే మ్యాచ్‌తో పాటు సిరీస్‌ను కూడా కైవసం చేసుకుంది. నామమాత్రపు చివరి వన్డే హ్యామిల్టన్ వేదికగా నవంబర్ 22న జరుగనుంది. అనంతరం డిసెంబర్ 2 నుంచి ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ మొదలవుతుంది. ఈ ఇన్నింగ్స్‌తో హోప్ ఈ ఏడాది విండీస్ తరఫున మూడు ఫార్మాట్లలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా అవతరించాడు. ఈ సెంచరీ హోప్‌కు వన్డేల్లో 19వది. క్రిస్ గేల్ (25) తర్వాత వన్డేల్లో విండీస్ తరఫున అత్యధిక సెంచరీలు చేసింది హోపే. 19 శతకాలను హోప్ కేవలం 142 ఇన్నింగ్స్‌ల్లో సాధించడం మరో విశేషం. ఈ సెంచరీలకు హోప్ 12 దేశాలపై చేశాడు.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.